RNI. APTEL/2008/25441,POSTAL NO. G/RNP/TS/MBN-03/2021-2023



న్యూఢిల్లీలోని సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్ నిరసనలో కర్ణాటక ముఖ్యమంత్రి తెలంగాణ కాంగ్రెస్, ఇండియా కూటమి ఎంపీలు

సత్యవార్త
SATYAVARTHA TELUGU DAILY

మహబూబ్‌నగర్ శనివారం, అక్టోబర్ 10, 2026 సంపుటి : 18 సంచిక : 242 పేజీలు 8 వెల 2/-

# ఢిల్లీలో ఆంక్షలపై సుప్రీం ఫైర్..!

## భద్రత పేరుతో మూసేస్తారా ?




న్యూఢిల్లీ, అక్టోబరు 9 : సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ ఢిల్లీలో రేపు జరగనున్న కాక్రోచ్ జనతా పార్టీ నిరసన నేపథ్యంలో భద్రతా చర్యల్లో భాగంగా 57 మెట్రో స్టేషన్లను మూసివేయడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. భద్రతా కారణాలతో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవచ్చని, అయితే సాధారణ ప్రజలు ప్రజా రవాణాను వినియోగించుకునే హక్కును కూడా పరిరక్షించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. భద్రతా పరిమితులు విధించడం అంటే అన్ని కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేయడం కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. నిరసన సందర్భంగా అదుపులేని జనసమూహం లేదా సంఘవిద్రోహ, దేశ వ్యతిరేక శక్తుల ప్రమేయం ఉంటుందనే ఆందోళన ఉంటే ప్రభుత్వం తగిన భద్రతా చర్యలు తీసుకోవచ్చని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. సీజేపీ నిరసనకు ముందు ఢిల్లీలో పలు రహదారులను మూసివేయడంపై కూడా సుప్రీంకోర్టు స్పందించింది. బారికేడ్ల కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడే ప్రాంతాల్లో ప్రయాణికులకు ప్రత్యామ్నాయ మార్గాల గురించి ముందుగానే సమాచారం అందించాలని సూచించింది. రెండేళ్లుగా జరిగింది ఇదీ..? ఈ అంశంపై స్పందించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, కోర్టు వ్యక్తం చేసిన ఆందోళనలను ప్రభుత్వానికి తెలియజేస్తానని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల వల్ల ఏదో తప్పు జరుగుతోందనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడుతోందని కూడా ఆయన పేర్కొన్నారు. రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లలో ఇప్పటికే సీసీటీవీ కెమెరాలు ఉన్నాయని, అవసరమైతే ప్రభుత్వం ఇతర భద్రతా చర్యలను కూడా అమలు చేయవచ్చని సీజేఐ గుర్తుచేశారు. అయితే భద్రతా ఏర్పాట్ల పేరుతో సాధారణ పౌరులు మెట్రో, రైల్వే స్టేషన్లకు వెళ్లకుండా నిరోధించకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిరసనలను నియంత్రించేందుకు నిబంధనలు విధించవచ్చని, కానీ వాటి వల్ల అన్ని కార్యకలాపాలను నిలిపివేయలేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. భద్రతా అవసరాలను దృష్టిలో ఉంచుకుంటూనే ప్రజా రవాణా, రహదారుల వినియోగం, ప్రయాణికుల సౌకర్యాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. మరోవైపు పోలీసుల అనుమతి లేకుండా చేసే నిరసనలు చట్ట విరుద్ధమైనవిగా పరిగణిస్తామని కూడా సుప్రీంకోర్టు తెలిపింది. ఇప్పటికే కాక్రోచ్ జనతా పార్టీ సభ్యులు పోలీసుల అనుమతి అవసరం లేదని చెప్తున్నారు. దీంతో వారు పోలీసుల అనుమతి కూడా కోరలేదు.

# జీఓ 59 పెండింగ్ దరఖాస్తులకు నెల రోజుల్లో పరిష్కారం: పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




హైదరాబాద్, అక్టోబర్ 9: 22ఎ సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలులో మరో కీలక ముందడుగు పడిందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈరోజు(శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ.. 22ఎ సమస్యల పరిష్కారానికి ఇప్పటివరకు ఏడు కీలక ఉత్తర్వులు ఇచ్చినట్లు చెప్పారు. తాజాగా జీఓ 59 దరఖాస్తుదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పిందన్నారు. 500 చదరపు గజాలలోపు జీఓ 59 పెండింగ్ దరఖాస్తులకు నెల రోజుల్లో పరిష్కరిస్తామని వెల్లడించారు. ఈ మేరకు కలెక్టర్లకు ప్రభుత్వం కీలక ఆదేశాలు ఇస్తూ.. మెమో నెం.48030 జారీ చేసినట్లు తెలిపారు. జీఓ 59 అమలులో అక్రమాలకు తావులేదని.. నిబంధనల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. గతంలో జీఓ 59 అమలులో జరిగిన అక్రమాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే జారీ చేసిన కన్వేయన్స్ డీడ్స్ కేసులను కూడా సమగ్రంగా పరిశీలించాలన్నారు. 22-ఎపై శరవేగంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీఎం హామీ ఇచ్చిన 24 గంటల్లోనే 22-ఎ సమస్యలపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేశామన్నారు. 22-ఎకు సంబంధించిన 10-12 సమస్యలను ఫాస్ట్‌ట్రాక్‌లో ప్రభుత్వం పరిష్కరిస్తోందని తెలిపారు.

# ఢిల్లీ ఏమైనా మీ అబ్బా సొత్తా?

## ఎంతమందిని అరెస్ట్ చేస్తారో చూస్తాం: అభిజిత్ దీప్కే



ఢిల్లీ, అక్టోబరు 9 : దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి హైటెన్షన్ నెలకొంది. కేంద్ర ఎన్నికల సంఘం తీరుకు వ్యతిరేకంగా రేపు జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చిన 'కాక్రోచ్ జనతా పార్టీ' నేతలు పోలీసుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పోలీసులు ఈ ధర్నాకు ముందస్తు అనుమతి నిరాకరించినప్పటికీ.. తాము అనుకున్న ప్రకారమే నిరసన తెలిపి తీరుతామని సవాలు విసిరారు. అరెస్టులకు, నిర్బంధాలకు అస్సలు భయపడేది లేదని, ఎంతమందిని జైలులో పెడతారో చూస్తామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ప్రకటించడంతో రాజధానిలో తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. నిరసన ప్రదర్శనలకు పోలీసులు అనుమతి నిరాకరించడంపై సీజేపీ నేత అభిజిత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్ర ప్రభుత్వం దేశ యువతను చూసి భయపడుతోందని, అందుకే మెట్రోలు, రైళ్లు, రహదారులను బంద్ చేస్తూ సామాన్య ప్రజలకు తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తోందని ఆరోపించారు. "ఢిల్లీ ఏమైనా నరేంద్ర మోదీ, అమిత్ షాల తాతముత్తాతల ఆస్తి అనుకుంటున్నారా? ఒకవైపు నిరసనల వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతోందని చెబుతూనే.. మరోవైపు మీరే మెట్రోలు, రైళ్లు, రహదారులను మూసేస్తూ జనాన్ని నానా అవస్థలు పెడుతున్నారు" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ప్రకారం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు తమకు ఉందని, దానికి ప్రత్యేకంగా అనుమతులు ఎందుకని ప్రశ్నించారు. కోట్ల ఓట్లను తొలగించే ముందు ఈసీ అనుమతి తీసుకుందా అని నిలదీశారు. అరెస్టులకు సిద్ధం.. అభిజిత్, సౌరభ్ సంచలన వ్యాఖ్యలు! ఈ ఆందోళన కార్యక్రమం నేపథ్యంలో పోలీసుల అరెస్టులకు తామంతా సంపూర్ణంగా సిద్ధంగా ఉన్నామని సీజేపీ నాయకులు స్పష్టం చేశారు. తమ పార్టీ నాయకులు సౌరభ్, అశుతోష్ సహా తామంతా జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని అభిజిత్ ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తమను చూసి వణుకుతోందని, ప్రధానమంత్రి, హోంమంత్రులు రోజూ బీపీ చెక్ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. తమను ఎంతమందిని అరెస్ట్ చేస్తారో చూస్తామని, జంతర్ మంతర్ వద్దకు చేరుకుని తమ నిరసన గళాన్ని వినిపించి తీరుతామని స్పష్టం చేశారు. మరోవైపు కాక్రోచ్ జనతా పార్టీ

# బండి భగీరధ్ హైకోర్టులో ఊరట

హైదరాబాద్, అక్టోబరు 10 : కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి మీడియా, సోషల్ మీడియా వేదికల్లో జరుగుతున్న ప్రసారాలను తక్షణమే నిలిపివేయాలని న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది.సదరు కేసులో తనకు ఇప్పటికే రెగ్యులర్ బెయిల్ మంజూరైనప్పటికీ, కొన్ని టీవీ ఛానెళ్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్ ఆ కేసుకు సంబంధించిన అంశాలను ప్రసారం చేస్తూ తమ కుటుంబ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నాయని ఆరోపిస్తూ భగీరథ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఈ.వి. వేణుగోపాల్ ధర్మాసనం విచారణ చేపట్టింది. భగీరథ్ తరపున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ వ్యక్తిగత కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను పోక్సో కేసుతో ముడిపెట్టి మీడియా ట్రయల్ నిర్వహిస్తున్నారని, ఇది వ్యక్తిత్వ హననానికి దారితీస్తోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే ఉన్న అభ్యంతరకర కంటెంట్‌ను తొలగించి, డిజిటల్ ఆధారాలను భద్రపరచాలని ఆయన కోరారు.

# తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంపై సీఎం రేవంత్ యాక్షన్ ప్లాన్



హైదరాబాద్, అక్టోబరు 9 : ఎల్‌నినో పరిస్థితులపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై సీఎం అక్టోబర్ 12వ తేదీన మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు, అధికారులకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించనున్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరిగిన విద్యుత్ డిమాండ్, తక్షణ అవసరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. కరవు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కేంద్రాన్ని కోరింది. వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన కార్యాచరణ, అఖిలపక్ష సమావేశం, రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణుల సలహాలు, సూచనలపై ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించే అవకాశం ఉంది.

# నవీ పిళ్లైకు నోబెల్ శాంతి



న్యూఢిల్లీ, అక్టోబరు 9 : అంతర్జాతీయ న్యాయం, మానవ హక్కుల కోసం దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న భారత సంతతి న్యాయమూర్తి నవనీతం 'నవీ' పిళ్లేను 2026 సంవత్సరానికి గాను అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి పురస్కారం వరించింది. యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేక నేరాలు, జాతి నిర్మూలన వంటి తీవ్రమైన అంశాలపై నేరస్థులను చట్టం ముందు నిలబెట్టేందుకు ఆమె చేసిన విశేష కృషికి గుర్తింపుగా నార్వేజియన్ నోబెల్ కమిటీ శుక్రవారం ఈ ప్రకటన చేసింది. అసాధారణమైన ధైర్యం, నైతిక నిబద్ధతతో ప్రపంచ న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆమె పోషించిన పాత్రను కమిటీ కొనియాడింది.దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో వర్ణవివక్ష పాలనలో మగ్గుతున్న ఒక భారత తమిళ మూలాలు ఉన్న కుటుంబంలో నవీ పిళ్లే జన్మించారు. సమాజంలో పాతుకుపోయిన తీవ్రమైన వివక్ష, వేర్పాటువాదాన్ని ధైర్యంగా ఎదుర్కొంటూ న్యాయవాదిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. వర్ణవివక్షకు వ్యతిరేకంగా గళమెత్తిన నెల్సన్ మండేలా వంటి ఎందరో ఉద్యమకారులకు ఆమె న్యాయవాదిగా అండగా నిలిచారు. తన సుదీర్ఘ కెరీర్‌లో ఆమె దక్షిణాఫ్రికా హైకోర్టు న్యాయమూర్తిగా, రువాండా అంతర్జాతీయ క్రిమినల్ ట్రైబ్యునల్ (ఎఱఖీ), అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు న్యాయమూర్తిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గానూ సేవలందించారు. ఇటీవల వరకు ఆక్రమిత పాలస్తీనా భూభాగంపై యూఎన్ ఏర్పాటు చేసిన స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కమిషన్‌కు అధ్యక్షత వహించారు. ప్రస్తుతం ఆమె మయన్మార్‌పై నమోదైన జాతి నిర్మూలన కేసులో అంతర్జాతీయ న్యాయస్థానం (ఎఅఏ)లో న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు. రువాండా ట్రైబ్యునల్‌లో నవీ పిళ్లే పాత్ర చరిత్రాత్మకమైనది. అత్యాచారం, లైంగిక హింసను కేవలం సాధారణ నేరాలుగా కాకుండా, మానవత్వానికి వ్యతిరేక నేరాలుగా, జాతి నిర్మూలన చర్యగా పరిగణించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. కేవలం విద్వేషపూరిత ప్రచారం ద్వారా జాతి నిర్మూలనకు ప్రేరేపించారన్న ఆరోపణలపై ఒక నిందితుడిపై విచారణ జరగడంలోనూ ఆమె ప్రభావం ఉంది. ఇది అంతర్జాతీయ న్యాయ చరిత్రలోనే ఒక మైలు రాయిగా నిలిచిపోయింది.ప్రపంచంలో యుద్ధాలు, ఘర్షణలు పెరిగిపోతున్నాయని, అంతర్జాతీయ చట్టబద్ధ పాలన తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోందని నోబెల్ కమిటీ తన ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది.

# సర్‌పై బీఆర్ఎస్ మౌనం.. బీజేపీతో లోపాయికారి ఒప్పందమంటూ మహేశ్ ఫైర్

## ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ ఫైర్



హైదరాబాద్, అక్టోబర్ 9: బీఆర్ఎస్ నేతలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సర్ ఆందోళనలో బీఆర్ఎస్ ఎక్కడుందని ప్రశ్నించారు. సీఈసీ తప్పిదం చేస్తుంటే హరీశ్ రావు, కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదని నిలదీశారు. నిరసన కార్యక్రమం ఎందుకు చేయడం లేదన్నారు. బీజేపీతో బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుందని ఆరోపించారు. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడితే ఈ-ఫార్ములా కేసులో అరెస్ట్ చేస్తారని, కాళేశ్వరం కేసులో సీబీఐ అరెస్ట్ చేస్తుందని భయమా అని ప్రశ్నించారు. ఉండటానికి ఇల్లు లేదన్న కేటీఆర్‌కు ఫైవ్‌స్టార్ హోటల్స్ ఎలా వచ్చాయని.. ఆయనకు ఇన్ని వేలకోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని నిలదీశారు. సర్ ప్రక్రియపై దేశ వ్యాప్తంగా బీజేపీ, మిత్ర పక్షాలు తప్ప అన్ని పార్టీలు రోడ్డెక్కాయన్నారు. 'సర్'లో దళితుల, మైనారిటీ, గిరిజనుల ఓట్లు తొలగిస్తున్నారని టీపీసీసీ చీఫ్ ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో రోహింగ్యాల పేరుతో మమత బెనర్జీని, బిహార్‌లో ఆర్జేడీని గెలవకుండా ఆపారన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పోరాటం చేస్తున్నారని తెలిపారు. జ్ఞానేశ్వర్ కుమార్‌ను తొలగించే వరకు నిరసన ర్యాలీలు కొనసాగుతాయని మహేశ్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాలనుకుంటే 2009లోనే అయ్యేవారని తెలిపారు. శాశ్వతంగా అధికారంలో ఉండాలని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌ను తొలగించారని.. జ్ఞానేశ్వర్ కుమార్ లాంటి తొత్తులను సీఈసీగా పెట్టుకుందని బీజేపీపై విరుచుకుపడ్డారు. నటుడు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వాస్తవాలు తెలుసుకోవాలని హితవుపలికారు. ప్రకాశ్ రాజ్ మాట్లాడే దాంట్లో నిజం లేదన్నారు. సర్ అంశంలో మొదట స్పందించింది కాంగ్రెస్ అని చెప్పుకొచ్చారు. అర్హుల ఓట్లు కాపాడటమే తమ లక్ష్యమన్నారు.

# పరిశ్రమల స్థాపనకు అనుమతులు సకాలంలో మంజూరు చేయాలి

## - టీఎస్-ఐపాస్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి

## : జిల్లా అదనపు కలెక్టర్ శ్రీను




సత్య వార్త నారాయణ పేట

నారాయణపేట జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ, టీఎస్–ఐపాస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులు, వివిధ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులు, పారిశ్రామికవేత్తలకు అందించాల్సిన సేవలు, అనుమతుల మంజూరు ప్రక్రియ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ శ్రీను మాట్లాడుతూ, రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న టీఎస్–ఐపాస్ విధానం ప్రకారం పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను నిర్దేశిత గడువులోగా మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమల స్థాపనకు అనుమతులు మంజూరు చేసే విషయంలో అనవసర జాప్యాన్ని నివారించాలని, దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు ప్రభుత్వ శాఖల నుంచి అందాల్సిన సేవలు పారదర్శకంగా, వేగవంతంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి వివిధ శాఖల నుంచి పొందాల్సిన అనుమతులు, ధ్రువపత్రాలు, ఇతర సేవల విషయంలో దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు తమ పరిధిలోని దరఖాస్తుల స్థితిగతులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో పారిశ్రామిక పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడంతో పాటు, నూతన పరిశ్రమల స్థాపనకు అవసరమైన సహకారం అందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎంటర్‌ప్రైజెస్‌కు సంబంధించి 16 యూనిట్లు, ఎస్టీ ఎంటర్‌ప్రైజెస్‌కు సంబంధించి 5 యూనిట్లు మంజూరైనట్లు జిల్లా అదనపు కలెక్టర్ వెల్లడించారు. అర్హులైన పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, పరిశ్రమల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. జిల్లాలో పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందడం ద్వారా పెట్టుబడులు పెరగడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ దిశగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, పరిశ్రమల స్థాపనకు సంబంధించిన ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రామలింగేశ్వర్ గౌడ్, డీ ఆర్డీవో వెంకట్ రాములు, ఎల్ డీ ఎం సురేష్ ఆత్రేయ, ఏ ఎం వి ఐ సాయితేజ్ రెడ్డి, అటవీ శాఖ అధికారి రమేష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శంకర్, విద్యుత్ శాఖ అధికారి రాజు నాయక్, ఏ సీ టీ వో సునీల్ సచిన్ తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో చేనేత కార్మికులను ఆదుకునేందుకు అన్ని విధాలుగా సహకరిస్తాం

## -అమరచింతలోని హ్యాండ్లూమ్ వీవర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ సందర్శించి చేనేత మగ్గంపై స్వయంగా చీర నేసిన జిల్లా కలెక్టర్



వనపర్తి సత్యవార్త బ్యూరో( అక్టోబర్ 9)

జిల్లాలో చేనేత రంగ అభివృద్ధికి, చేనేత కార్మికుల సంక్షేమానికి అన్ని విధాలుగా సహకరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. శుక్రవారం అమరచింత మండల పరిధిలోని చేనేత హ్యాండ్లూమ్ వీవర్స్ ప్రొడ్యూసర్ కంపెనీని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ చీరలు తయారు చేసే విధానాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం మగ్గంపై కూర్చొని చీర నేసే విధానాన్ని ప్రయత్నించి చూశారు. అక్కడి చేనేత కార్మికులతో మాట్లాడి చీరల తయారీ ప్రక్రియ, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాల గురించి తెలుసుకున్నారు. అమరచింత చీరల ప్రత్యేకతను, చేనేత రంగానికి సంబంధించిన ఇతర వివరాలను పరిశ్రమల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. చేనేత కార్మికులకు బ్యాంకుల ద్వారా రుణాలు పొందడంలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించి, సులభంగా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, చేనేత యూనిట్‌లో ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందించేలా కృషి చేస్తామని తెలిపారు. చేనేత కార్మికులకు బ్యాంకుల ద్వారా రుణాలు సులభంగా అందేలా చర్యలుతీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేస్తామని పేర్కొన్నారు. అమరచింత చేనేత ప్రొడ్యూసర్ కంపెనీ యూనిట్‌లో ఎండ వేడిమి నుంచి కార్మికులకు ఉపశమనం కల్పించేందుకు సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేసే దిశగా అవకాశాలను పరిగణలోకి తీసుకోవాలని పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులను ఆదేశించారు. చేనేత రంగాన్ని ప్రోత్సహిస్తూ, కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. చేనేత శాఖ ఏడి ఇందిర, ఇక్కడ మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

## -వసతి గృహాల్లో విద్యార్థినుల ఆరోగ్యం, ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

పెబ్బేరు అక్టోబర్09 సత్యవార్త ప్రతినిధి

పెబ్బేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని బీసీ బాలికల వసతి గృహంలో బుధవారం రాత్రి విద్యార్థినులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి శుక్రవారం వసతి గృహాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి భోజనం నాణ్యత, తాగునీరు, వసతి గృహంలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు అస్వస్థతకు గురికావడానికి గల కారణాలపై సంబంధిత అధికారులు, విద్యార్థినులను విచారించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ అధికారులు స్పందిస్తూ మొత్తం 22 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు, వారందరినీ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, వసతి గృహంలో బుధవారం రాత్రి చికెన్ తో భోజనం చేసిన అనంతరం కొందరు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. ఈ ఘటనకు ఆహారం కలుషితం కావడం కారణమై ఉండవచ్చని తెలిపారు. అనారోగ్యానికి గురైన విద్యార్థినులకు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వసతి గృహంలో



తాగునీటి శుద్ధి యంత్రానికి సంబంధించిన ఫిల్టర్‌ను వెంటనే మార్చించాలని, పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిశుభ్రతను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు భోజనం వడ్డించే ముందు సంబంధిత అధికారులు తప్పనిసరిగా ఆహారాన్ని రుచి చూసి, నాణ్యతపై పూర్తి నమ్మకం కలిగిన తర్వాతే వడ్డించాలని కలెక్టర్ సూచించారు. వసతి గృహాల్లో విద్యార్థినుల ఆరోగ్యం, ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులకు సురక్షితమైన ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ అధికారిని ప్రమీల, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# మెగా జాబ్ మేళా అద్భుతం యువతకు ఇదొక వరం

## -రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



సత్యవార్త భూపాలపల్లి ప్రతినిధి అక్టోబర్ 9 ;

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా అద్భుతంగా నిర్వహించారని రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అభినందనలు తెలియజేస్తూ భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు భూపాలపల్లి మున్సిపాలిటీ చైర్మన్ బుర్ర కొమురయ్య వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ జిల్లా అధికారులను జిల్లా కాంగ్రెస్ శ్రేణుల కృషి పొగడదగినదనిఅన్నారు. ముఖ్యంగా యువతకు మెగా జాబ్ మేళా ఒక వరం అని నిరుద్యోగ యువత దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువత చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకొని ఉన్నత వేతనాలతో కూడిన ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు. భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు చొరవతో 142 కంపెనీల ప్రతినిధులు పాల్గొని యువతకు ప్రతి కంపెనీలో చదువును బట్టి పదివేల రూపాయల 20 వేల వేతనముతో ప్రారంభం అయి నెలకు 50 వేల నుంచి 70 వేల వేతనము పొందే అవకాశం ఉంటాయన్నారు. వ్యవసాయం కూలీ పనులు చిన్న కుటీర పరిశ్రమలు చేసుకుంటూ తల్లిదండ్రులు తమ పిల్లలను చదివిస్తున్నారని వారి కష్టాన్ని గుర్తించి యువతకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువతకు తగినశిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీతో పాటు టాస్క్ ద్వారా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వము అధికారములోకి వచ్చిన తర్వాత సుమారు 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసినట్లు వివరించారు. గ్రూప్ 1,2,3,4 పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తూ అర్హులకు అవకాశాలు కల్పిస్తున్నట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. పదోతరగతి మొదలుకొని ఇంజనీరింగ్ పీజీ తదితర విద్యార్హతలు కలిగిన యువత ప్రైవేటు రంగంలోనూ ఉద్యోగాలు సాధించేలా జాబ్ మేళాలు దోహదపడుతాయని పేర్కొన్నారు. జాబ్ మేళా ప్రారంభమైన రెండు గంటల్లోనే 600 మందికి పైగా యువత ప్రాథమికంగా ఎంపికైనట్లు మంత్రి వెల్లడించారు. ఈ జాబ్ మేళా ద్వారా ఒక్కో కంపెనీ 100 నుంచి 400 మందిని ఎంపిక చేసుకొనుటకు ఆసక్తి చూపించడం గొప్ప విషయం అన్నారు. యువత ప్రాంతీయ భావన లేకుండా పాల్గొనేటట్లు చేసిన భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు కృషి అమోఘం అని తెలిపారు. ఇంకా తన నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి, భూపాలపల్లి పట్టణంలో రోడ్ల విస్తరణ, 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. పారిశ్రామిక రంగం అభివృద్ధి ద్వారా స్థానికంగా మరిన్ని ఉపాధి అవకాశాలు ప్రభుత్వం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇదే కార్యక్రమంలో భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ భూపాలపల్లి నిరుద్యోగ యువతకు మెగా జాబ్ మేళా గొప్ప అవకాశం అని ఇందులో పన్నెండు వేల వరకు ఉద్యోగాలు కల్పించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. సింగరేణి సంస్థ సహకారంతో శిక్షణ కేంద్రానికి విశాలమైన హాలు ఏసీ వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గత సంవత్సరం జాబ్ మేళా నిర్వహించి 2700 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ 142 కంపెనీలు పాల్గొన్న ఈ జాబ్ మేళాను యువతీయువకులు ఉద్యోగావకాశాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యస్పీ సిరిశెట్టి సంకీర్త్ టాస్క్ సీఈవో ప్రదీప్ రెడ్డి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, రాష్ట్ర ఉపాధి హామీ పథకం డైరెక్టర్ దండు రమేశ్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య,వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, మునిసిపల్ కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు వివిధ శాఖల అధికారులు కంపెనీల ప్రతినిధులు నిరుద్యోగ యువతీయువకులు పాల్గొన్నారు.

# వృద్ధుల సంరక్షణకు చట్టం పకడ్బందీగా అమలు

## -డే కేర్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలి : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

## -ఐడీఓసీలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

## -వృద్ధులకు సన్మానం, వృద్ధుల చట్టంపై అవగాహన



రాజన్న సిరిసిల్ల,సత్య వార్త:అక్టోబర్ -09

వయోవృద్ధుల, తల్లితండ్రుల సంరక్షణకు చట్టం పకడ్బందీగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వయో వృద్ధుల, తల్లితండ్రుల సంక్షేమానికి అమలు చేస్తున్న చట్టాలు, పథకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవాధికర సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి వృద్ధుల సంరక్షణ చట్టాలు, ఉపయోగాలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వృద్ధుల నుంచి గౌరవం, మర్యాద, సంస్కృతి, సంప్రదాయాలు, విశేషమైన అనుభవాలు ఇప్పటి తరం వారు తీసుకోవాలని సూచించారు. వృద్ధులు తాము జీవితాంతం కష్టపడి సంపాదించిన ఆస్తిని మొత్తం తమ పిల్లల పేరిట చేయవద్దని సూచించారు. ఒకవేళ చేయాల్సి వస్తే తమ సంరక్షణ చూడకపోతే వెనక్కి తీసుకుంటామనే నిబంధన పెట్టి చేయాలని తెలిపారు.

వృద్ధ మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించిందని తెలిపారు. జిల్లాలో 469 సంఘాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. వృద్ధ మహిళలు చేరాలని, సంఘటితంగా ఉండాలని పిలుపు నిచ్చారు. వృద్ధులు తమ మనుమడు, మనుమరాలు కు నీతి కథలు, మంచి అలవాట్లు తెలియజేయాలని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని డే కేర్ సెంటర్ సేవలు ఉన్నాయని తెలిపారు. వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. వృద్ధులు సమాజ సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యులు కావాలని కోరారు. సంఘాలుగా ఉండాలని సూచించారు. వృద్ధులు సంప్రదించాలివృద్ధులు తమకు వచ్చిన ఇబ్బందులు తెలియజేసేందుకు పోలీస్ స్టేషన్ కు రావచ్చని ఎస్పీ మహేష్ బి గితె తెలిపారు. పోలీసులు ఎప్పుడూ అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని వివరించారు. వారికి అండగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికర సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి, ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సౌమ్య, వృద్ధ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం అమలులో ఉత్తమ పనితీరుకు జిల్లా కలెక్టర్ అంకిత్‌కు అవార్డు

## - హైదరాబాద్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా అవార్డు స్వీకరణ

## -పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన ప్రజాకేంద్రిత పాలనకు జిల్లాకు రాష్ట్రస్థాయి గుర్తింపు




భద్రాద్రి కొత్తగూడెం సత్య వార్త అక్టోబర్ 9

సమాచార హక్కు చట్టం అమలులో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సమాచార హక్కు వారోత్సవాలు--2026 కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ అంకిత్ ఈ అవార్డును స్వీకరించారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడం, పౌరులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించడం, చట్ట నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయడం లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాచార హక్కు చట్టం అమలులో ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లాలను గుర్తించి అవార్డులను ప్రదానం చేశారు. సమాచార హక్కు చట్టం ద్వారా పౌరులకు ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని పొందే హక్కు కల్పించబడింది. ప్రభుత్వ శాఖలు పారదర్శకంగా వ్యవహరించడంతో పాటు ప్రజలకు జవాబుదారీగా ఉండేలా చూడటంలో ఈ చట్టం కీలక పాత్ర పోషిస్తుంది. చట్ట నిబంధనల ప్రకారం ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచడం ద్వారా ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించవచ్చు. జిల్లా కలెక్టర్ అంకిత్ నేతృత్వంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యంత్రాంగం ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో పారదర్శకతను పాటించేందుకు కృషి చేస్తోంది. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించడం, వివిధ శాఖల పనితీరులో జవాబుదారీతనాన్ని పెంపొందించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ జిల్లా యంత్రాంగం ముందుకు సాగుతోంది. సమాచార హక్కు చట్టం అమలులో జిల్లాకు లభించిన ఈ అవార్డు ప్రజాకేంద్రిత పాలన, పారదర్శకత, జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రోత్సాహాన్నిస్తుందని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు . ప్రభుత్వ పాలనలో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ, సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు అవసరమైన సమాచారాన్ని నిబంధనల ప్రకారం అందించడం, ప్రభుత్వ శాఖలు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించేలా చూడటం ముఖ్యమని ఆయన తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, పారదర్శకమైన పరిపాలనను కొనసాగించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు.

# సత్యవార్త

## సంపాదకీయం

శనివారం,అక్టోబర్10,2026


## ఎరుపు రంగులోకి భూగోళం.. సూపర్ డూపర్ ఎలినినో

పసిఫిక్ మహా సముద్రంలో ఏర్పడిన ఎల్ నినో క్రమంగా తీవ్రరూపం దాల్చుతోంది. ఇప్పటికే దీని ప్రభావంతో భారత్ సహా దక్షిణాసియాలో నైరుతి రుతుపవనాల కాలంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యింది. అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య ఇది మరింత తీవ్రస్థాయికి చేరుకుంటుందని ఇటీవల ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరించింది. తాజాగా, అంతర్జాతీయ వాతావరణ నిపుణులు ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తూ.. సూపర్ ఎల్ నినో దెబ్బకు భూగోళం మొత్తం ఎరుపుగా మారిపోయిందని మ్యాప్‌ను షేర్ చేశారు.గతంలో ఎన్నడూ లేనంత తీవ్రస్థాయికి చేరుకుంటోన్న ఎల్ నినో ప్రభావంపై ప్రపంచవ్యాప్తంగా వాతావరణ నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1950 తర్వాత నమోదుకాబోతున్న అత్యంత బలమైన వాతావరణ పరిణామాలలో ఇది ఒకటి కావచ్చని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. మానవ తప్పిదాల వల్ల జరుగుతున్న వాతావరణ మార్పుల తీవ్రతను ఈ ఎల్ నినో మరింత పెంచుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడించింది. పసిఫిక్ మహాసముద్రం అంతర్భాగంలో దాగివున్న అధిక ఉష్ణోగ్రతలను బయటకు విడుదల చేయడం వల్ల భూగోళంలో అత్యధిక భాగం అసాధారణమైన వేడిని ఎదుర్కొంటుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.రియాన్ మౌ అనే అంతర్జాతీయ వాతావరణ నిపుణుడు మొత్తం భూగోళానికి సంబంధించిన క్లైమేట్ మ్యాప్‌ను సోషల్ మీడియా వేదిక ఎక్స్ (ట్విట్టర్)లో పంచుకుంటూ... భూగోళం అంతా దాదాపుగా ఎరుపు రంగులోకి (తీవ్రమైన వేడికి సూచికగా) మారిపోయిందని పేర్కొన్నారు. “అమెరికా మినహా మిగిలిన ప్రపంచమంతటా ఉష్ణోగ్రతలను విపరీతంగా పెంచుతూ ఈ ఎల్ నినో శీతాకాలంలో కూడా తన ‘గరిష్ట ప్రతాపాన్ని’ చూపిస్తోంది” అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఎల్ నినో తీవ్రత వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగుతుందన్న చిఓూ అంచనాతో ఆయన కూడా ఏకీభవించారు.మరో శాస్త్రవేత్త జీకే హాస్‌ఫాథర్ స్పందిస్తూ... “ఈ ఏడాది ఎల్ నినో రికార్డులను తిరగరాస్తూ కొత్త గరిష్టాలకు చేరుకుంటోంది.. నినో 3.4 ప్రాంతంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3.4 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా నమోదయ్యాయి. ఇది ఇప్పటివరకు నమోదైన ఏ ఇతర ఎల్ నినో పరిణామం కంటే కూడా అత్యధికం” అని పేర్కొన్నారు. లియోన్ సిమన్స్ అనే మరో నిపుణుడు ఈ పరిణామాన్ని ‘సూపర్–డూపర్ ఎల్ నినో’ గా అభివర్ణించారు.ప్రపంచ వాతావరణ సంస్థ అంచనాల ప్రకారం.. 2026 చివరి నెలల్లో ప్రపంచంలోని ఎక్కువ భాగంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే చాలా ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ముఖ్యంగా ఎల్ నినో పుట్టకకు కేంద్రమైన మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్రంలో అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రికార్డు స్థాయిలో 3.7 డిగ్రీల సెల్సియస్ (6.7 డిగ్రీల ఫారెన్‌హీట్) ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు.సాధారణంగా ఎల్ నినో అనేది సహజంగా సంభవించే ‘ఎల్ నినో–సౌత్ ఐసోలేషన్’ చక్రంలో భాగమైన ఒక వేడి దశ. ఇది ప్రపంచ వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ప్రతి రెండు నుంచి ఏడేళ్లకు ఒకసారి సంభవించే ఈ వాతావరణ మార్పుల వల్ల ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరగడమే కాకుండా, వర్షపాత వ్యవస్థలు దెబ్బతింటాయి. దీనివల్ల కొన్ని ప్రాంతాల్లో తీవ్ర కరువు కాటకాలు, మరికొన్ని ప్రాంతాల్లో తుఫానులు, భారీ వర్షాలు సంభవిస్తాయి.ఈ అసాధారణ పరిస్థితుల వల్ల ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, తీవ్రమైన ఈదురుగాలులు, తీరప్రాంత వరదలు, బీచ్ కోత ప్రమాదాలు చాలా ఎక్కువగా ఉంటాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. పరిస్థితి తీవ్రతను ముందే గ్రహించిన కాలిఫోర్నియా గవర్నర్ గెవిన్ న్యూసమ్, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు, శీతాకాలపు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా గత నెలలోనే రాష్ట్ర అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.సమీప కాలంలో ద్రవ్యోల్బణంపై సరఫరా వైపు నుంచి ఒత్తిళ్లు కొనసాగొచ్చని ఆర్బీఐ తెలిపింది. బలహీనమైన నైరుతి రుతుపవనాలు, ఎల్ నినో పరిస్థితులు, అంతర్జాతీయ చమురు ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు దీనికి కారణమవుతాయని పేర్కొంది. చమురును మినహాయిస్తే ఆహార విభాగంలోని పలు కమోడిటీల ధరల్లో కూడా ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తోంది. కోర్ ద్రవ్యోల్బణం పెరగడం, సీపీఐ బాస్కెట్‌లోని మరిన్ని వస్తువుల ధరలు పెరగడం చూస్తే ద్రవ్యోల్బణం ఒకటి రెండు వస్తువులకు పరిమితం కాకుండా విస్తృతంగా మారే తొలి సంకేతాలు కనిపిస్తున్నాయని ఆర్బీఐ తెలిపింది. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని 2026–27లో సీపీఐ ద్రవ్యోల్బణం 5.2 శాతంగా ఉండొచ్చని ఆర్బీఐ అంచనా వేసింది. రెండో త్రైమాసికంలో 4.9 శాతం, మూడో త్రైమాసికంలో 6.0 శాతం, నాలుగో త్రైమాసికంలో 5.7 శాతంగా ఉండొచ్చని తెలిపింది. 2027–28 తొలి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 5.6 శాతంగా ఉంటుందని అంచనా వేసింది.

## పిల్లలమర్రిని ఆధునిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

### -రూ.2.5 కోట్లతో చేపట్టిన పర్యాటక అభివృద్ధి పనుల పరిశీలన.. సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష



సత్య వార్త మహబూబ్ నగర్

మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన పిల్లలమర్రిని అన్ని ఆధునిక సౌకర్యాలతో ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ పిల్లలమర్రిని సందర్శించి పర్యాటక, అటవీ, మత్స్య, విద్య, పురావస్తు శాఖల ఆధ్వర్యంలో రూ. 2.5 కోట్ల తో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, చేపట్టాల్సిన పనులపై పలు సూచనలు చేశారుపర్యటనలో భాగంగా ముందుగా పర్యాటక ప్రాంతంలోని ప్రవేశ ద్వారం, టికెట్ కౌంటర్, మరుగుదొడ్లు, ప్రహరీ తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని, పర్యాటక ప్రాంతం ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం సైన్స్ మ్యూజియాన్ని పరిశీలించిన కలెక్టర్, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ మ్యూజియం తరహాలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. చిల్డ్రన్స్ పార్కును కూడా ఆకర్షణీయంగా, రంగురంగుల ఆట పరికరాలతో ఆధునికీకరించాలని ఆదేశించారు. పాతబడిన ఆట పరికరాలను తొలగించి, కొత్త పరికరాలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన బడ్జెట్ అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.పురావస్తు శాఖ ఆధ్వర్యంలోని ప్రదర్శనశాలను సందర్శించిన కలెక్టర్, ప్రాచీన కాలం నుంచి ఆధునిక కాలం వరకు చారిత్రక ప్రాధాన్యత కలిగిన వస్తువులు, విగ్రహాలను పరిశీలించారు. వాటి చారిత్రక నేపథ్యం, ప్రాధాన్యత తెలిసేలా సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. పాత భవనాల స్థితిగతులను పరిశీలించి, పై కప్పు పెచ్చులు ఊడుతున్న వాటిని గమనించిన కలెక్టర్ వాటిని మరమ్మతులు లేదా పునరుద్ధరణ చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు.సైన్స్ మ్యూజియం పరిసరాల్లో చెత్తాచెదారం గడ్డి లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పిల్లలమర్రి ప్రసిద్ధ మర్రిచెట్టు పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, ప్రాంగణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పచ్చదనం పెంపొందించేలా ల్యాండ్‌స్కేపింగ్ చేపట్టాలని సూచించారు. సందర్శకులకు తాగునీరు, చెత్తబుట్టలు వంటి సదుపాయాలు కల్పించాలని, గడ్డి, మొక్కలు పచ్చగా ఉండేలా క్రమం తప్పకుండా నీటిని అందించాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. కేఫ్‌టేరియా ప్రాంతంలోనూ సందర్శకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.జింకల పార్కును సందర్శించిన కలెక్టర్ అక్కడ ఉన్న జింకల సంఖ్య, వాటికి అందిస్తున్న ఆహారం, తాగునీరు, సంరక్షణ చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సుమారు 85 జింకలు ఉన్నట్లు అధికారులు వివరించారు. జింకల సంరక్షణ, వాటి ప్రాధాన్యతపై అటవీశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.మత్స్యశాఖ ఆధ్వర్యంలోని ఆక్వేరియాన్ని పరిశీలించిన కలెక్టర్, సుమారు 27 ఏళ్ల క్రితం నిర్మించిన భవనాన్ని ఆధునికీకరించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ, సంబంధిత ఇంజినీరింగ్ అధికారుల సమన్వయంతో సమగ్ర అభివృద్ధి పను చేపట్టాలని, ఆధునిక ఆక్వేరియంలు, 3డీ గ్రాఫిక్స్, ఆకర్షణీయమైన పెయింటింగ్స్‌తో పాటు సందర్శకులను ఆకట్టుకునేలా ప్రదర్శనలను అభివృద్ధి చేయాలని తెలిపారు. ఈ పనులకు అవసరమైన నిధుల కోసం మత్స్యశాఖ కమిషనర్ ద్వారా ప్రతిపాదనలు సమర్పించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఆక్వేరియం, జంతు ప్రదర్శన ప్రాంతాల్లో వివిధ రకాల జలచరాలు, పాములు, ఇతర జీవుల గురించి విద్యార్థులకు అవగాహన కలిగించేలా సమాచార సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వాటి జీవన విధానం, ప్రత్యేకతలు, పర్యావరణంలో వాటి పాత్రను వివరించే సమాచారాన్ని స్పష్టంగా పొందుపరచాలని సూచించారు. పిల్లలమర్రిలోని అన్ని పర్యాటక ఆకర్షణలను సమగ్రంగా అభివృద్ధి చేసి, సందర్శకులకు మెరుగైన అనుభూతి కలిగించేలా శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. అవసరమైన పనులకు సంబంధించి అంచనాలు, బడ్జెట్ ప్రతిపాదనలు, కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, డి.ఆర్.ఓ ఎ. నిర్మల, డి.ఎఫ్.ఓ ఎం.నవీన్ రెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి జె.రాజశేఖర్ రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి రాధా రోహిణి, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగలక్ష్మి, విద్యాశాఖ నుండి ఎ.ఎం.ఓ డి.శ్రీనివాస్, అటవీశాఖ అధికారులు, పర్యాటక శాఖ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కర్వగడ్డపల్లి దర్గాలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రత్యేక ప్రార్ధనలు

### -మతసామరస్యం, ప్రజల సంక్షేమం కోసం దర్గాలో ప్రార్ధనలు నిర్వహించిన ఎమ్మెల్యే



సత్య వార్త మహబూబ్ నగర్

జడ్చర్ల మండలంలోని కర్వగడ్డపల్లి గ్రామంలో ఉన్న దర్గాను జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ప్రార్థించారు. ప్రజల మధ్య మతసామరస్యం, సోదరభావం, ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు.

## తహసిల్దార్ ఆధ్వర్యంలో భూ సర్వే



సత్యవార్త రేగొండ గోరికొత్తపల్లిఅక్టోబర్ 9 :

జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండలం చెన్నాపూర్ గ్రామంలో భూసర్వే శుక్రవారం చేసారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మాట్లాడుతూ భూ సర్వేలో భాగంగా రైతులనుద్దేశించి భూమికి సంబంధించిన కాగితాలు పట్టా పాసుపుస్తకాలు లేదా కొనుగోలుకు సంబంధించిన బాండ్ పేపర్లు అగ్రిమెంట్ పత్రాలు సర్వేయరుకు చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్ ఐ విజయలక్ష్మి,చెన్నాపూర్ జీపీఓ రమేశ్, సర్పంచ్ పల్లెవేని బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

## కేరళ గ్లోబల్ హై స్కూల్లో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు

సత్యవార్త, రుద్రంగి, (అక్టోబర్ 09)



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రంలోని కేరళ గ్లోబల్ హై స్కూల్ ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ సంబరాలు శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల పువ్వులతో బతుకమ్మను పేర్చి పసుపుతో గౌరమ్మను చేసి బతుకమ్మ పాటలతో ఆడిపాడారు. ఈ సందర్భంగా కేరళ స్కూల్ చైర్మన్ బాబు నంబియర్ కరస్పాండెంట్ లతికా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుని గౌరవించాలని అన్నారు.ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో ఐక్యత, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. తెలంగాణ అంటేనే సంస్కృతి సంప్రదాయాలకు పెట్టింది పెరు అని అన్నారు. తెలంగాణ అడపడుచులందరు ఘనంగా జరుపుకునే ఎంగిలిపూల బతుకమ్మ పండుగను పాఠశాలలో ఘనంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. చిన్నారులు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి పాటలు పాడుతూ కొలటలు వేస్తూ ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందని అన్నారు. రుద్రంగి మండల ప్రజలకు మరియు కేరళ స్కూల్ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు బతుకమ్మ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలోస్కూల్ ఇంచార్జ్ నరిగే విజయ్, యాజమాన్యం మరియు టీచర్లు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు బయలుదేరిన వనపర్తి జిల్లా జూనియర్ బాలికల జట్టు



పెబ్బేరు అక్టోబర్ 09 సత్యవార్త ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు వనపర్తి జిల్లా జట్టు శుక్రవారం బయలుదేరారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఈ పోటీలు జరగనున్నాయి.ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎం. కురుమయ్య జట్టు సభ్యులకు ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర కబడ్డీ టోర్నమెంట్‌లో వనపర్తి జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. బాలికల జట్టు కూడా ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ ఈసీ సభ్యుడు కమలాకర్, పెబ్బేరు జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు నరసింహ గౌడ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర లక్ష్యం బాపు కె.సి.ఆర్ కల

### -పరిపాలన వికేంద్రీకరణ....పాలన సంస్కరణలు తెచ్చించి కె.సి.ఆర్

### - మాజీ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి



వనపర్తి సత్యవార్త బ్యూరో (అక్టోబర్ 9)

తెలంగాణ జాతిపిత కల్వకుంట్ల.చంద్రశేఖర్ రావు తెలంగాణ ఆత్మాభిమానం,ఆత్మస్థైర్యం కోసం పోరాడి రాష్ట్రాన్ని సాధించిందని,పరిపాలన వికేంద్రీకరణ,పాలన సంస్కరణలలో భాగంగా నూతన మండలాలు ఏర్పాటు చేసి నూతన జిల్లాలు అందుబాటులోకి తెచ్చి 10ఏండ్లు పూర్తి అయిశీదని,ఈ సంధర్భంగా ఈనెల 11న ప్రియతమ నాయకులు కె.సి.ఆర్ కృతజ్ఞత పూర్వకంగా అభినందనలు,వేడుకలు నిర్వహించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి ప్రజలకు, బి.ఆర్.ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.శుక్రవారం జిల్లా కేంద్రం లోని ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రజలకు పరిపాలన అందుబాటులోకి తీసుకొచ్చి ఎక్కడో 100,150కిలోమీటర్ల దూరములో ఉన్న కలెక్టర్ల దగ్గరికి పోలేక తమ సమస్యకు దారికి లేక నానా ఇక్కట్లు పడుతున్న ప్రజల కోసం 33జిల్లాల ఏర్పాటు అతి చేరువలో మండలాలు ఏర్పాటు చేసి నూతన పరిపాలన సంస్కరణకు నాంది పలికిన మహోన్నత వ్యక్తి కె.సి.ఆర్ అని కొనియాడారు.జిల్లాల వికేంద్రీకరణతో పాటు జిల్లా స్థాయి కార్యాలయాలు,ఉపాధి అవకాశాలు,ప్రజల జీవన శైలిలో మార్పుతో పాటు అనేక ఆర్థిక అంశాలు మెరుగైనాయి అని కొనియాడారు. కె. సి.ఆర్ పాలన చరిత్రలో సువర్ణ అధ్యాయమని కాబట్టి వారికి కృతజ్ఞతలు తెలపడం మన బాధ్యత అని అన్నారు. కొత్త మండలాలు ఏర్పాటు అయిన వారు కృతజ్ఞత సభలు నిర్వహించాలని,కొత్త జిల్లాల వారు కృతజ్ఞత ర్యాలీలు నిర్వహించాలని నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు.

## కాట్రేవ్ పల్లి లో ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం : పాల్గొన్న మంత్రి సతీమణి వాకిటి లలిత



సత్యవార్త మక్తల్ టౌన్

మక్తల్ మండలంలోని కాట్రపల్లి గ్రామంలో బషీర్ షవన నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, రవాణా, క్రీడా శాఖ మంత్రివర్యులు డా. వాకిటి శ్రీహరి సతీమణి శ్రీమతి వాకిటి లలితమ్మ హాజరై రిబ్బన్ కట్ చేసి ఇంటిని ప్రారంభించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 5 లక్షల రూపాయలు ఉచితంగా అందజేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కట్టా సూరయ్య, కాట్రపల్లి గ్రామ అధ్యక్షులు దాసరి చెన్నయ్య, కురువ లింగప్ప , గడ్డం నర్సప్ప, మక్తల్ మండల అధ్యక్షులు శ్రీనివాసులు గౌడ్ , రుద్రసముద్రం సర్పంచ్ లింగప్ప, ముసలాయిపల్లె సర్పంచ్ నాగరాజ్ , గోలపల్లి సర్పంచ్ సూర్యకుమార్ మక్తల్ గోవర్ధన్, చెన్నయ్య గౌడ్ , పాల్గొన్నారు.

## మాస్టర్ మైండ్స్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

పెబ్బేరు అక్టోబర్ 09సత్యవార్త ప్రతినిధి



పెబ్బేరు మున్సిపాలిటీలోని మాస్టర్ మైండ్స్ హై స్కూల్ ప్రాంగణం నందు బతుకమ్మ వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ లావణ్య రంగారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ వేడుకలలో పాఠశాల ఉపాధ్యాయిని బృందం మరియు విద్యార్థులు రంగురంగుల పూలను తంగేడు పూలను పేర్చి ఎన్నో రకాలైన బతుకమ్మలను తయారు చేసి పాఠశాల ప్రాంగణం నందు ఉంచి భక్తిశ్రద్ధలతో పూజించి, తదనంతరం రకరకాల బతుకమ్మ పాటలతో, కోలాటాలతో ఆడి పాడి పాఠశాల యందు ఒక పండగ వాతావరణం నెలకొల్పారు . తదనంతరం కరస్పాండెంట్ శ్రీమతి లావణ్య రంగారెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ విశిష్టతను వివరించారు. చివరగా కోలాటాలతో బతుకమ్మను సాగనంపుతూ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఈర్లదిన్నె రంగారెడ్డి ,పాఠశాల ఉపాధ్యాయ బృందం ,విద్యార్థిని విద్యార్థులు విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు పాల్గొని ఈ వేడుకలను విజయవంతంగా చేశారు

# 54 మందికి ఒకే ఇల్లు అమ్మకం భాగ్యనగరంలో బడా మోసగాళ్లు



హైదరాబాద్, అక్టోబరు 9 : హైదరాబాద్ నగరంలో ఆస్తి మోసాల ఘటనలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. రియల్ ఎస్టేట్ పుంజుకోవటం, నగరంలో ప్రాపర్టీలకు డిమాండ్ పెరగటంతో మోసాలు కూడా ఎక్కువవుతున్నాయి. తాజాగా.. ఒకే భవనాన్ని 54 మందికి విక్రయించి, తాకట్టు పెట్టి సుమారు రూ.4.5 కోట్లు వసూలు చేసిన వ్యవహారం బయటపడగా.. మరోచోట ప్రభుత్వ అధికారుల సంతకాలు, కార్యాలయాల సీళ్లు ఫోర్జరీ చేసి నకిలీ ఆస్తి పత్రాలు సృష్టించిన ముఠా గుట్టు రట్టయింది. ఇంకోవైపు ఖాళీగా ఉన్న భూములను గుర్తించి నకిలీ యజమానులను సృష్టించి విక్రయించేందుకు ప్రయత్నించిన రౌడీషీటర్ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. మూడు కేసుల్లో ఐదుగురిని అరెస్టు చేయగా.. పలువురు నిందితులు పరారీలో ఉన్నారు. నకిలీ పత్రాలతో ఆస్తి మోసాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని మల్కాజిగిరి సీపీ బి.సుమతి హెచ్చరించారు. మాదన్నపేట దారాబ్‌జంగ్ కాలనీలో గ్రౌండ్ ఫ్లోర్, రెండు అంతస్తులు, పెంట్‌హౌస్ ఉన్న భవనం రషాద్ ఉల్ ఖైర్, ముంతాజ్‌బేగం ఆధీనంలో ఉంది. దాన్ని వివిధ వ్యక్తులకు ఒకరికి తెలియకుండా మరొకరికి విక్రయించేందుకు ఒప్పందాలు చేసుకున్నట్లు సీసీఎస్ పోలీసులు తెలిపారు. బ్రోకర్ల ద్వారా ప్రచారం చేయడంతోపాటు, నమ్మకం కలిగించేందుకు పెంట్‌హౌస్‌లో ఉంటున్న అస్మాబేగంను కిరాయిదారుగా చూపించారు. కొందరికి కొంతకాలం అద్దె కూడా చెల్లించారు. 2021 మార్చి నుంచి ఈ ఏడాది జూన్ వరకు 54 మంది నుంచి సుమారు రూ.4.5 కోట్లు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. రూ.15 లక్షలు నష్టపోయిన నయీం బాను ఫిర్యాదుతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అస్మాబేగంను అరెస్టు చేయగా.. ప్రధాన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది. మరో కేసులో డాక్యుమెంట్ రైటర్ దేవగుప్తపు వీర వెంకట సత్యనారాయణ, అతని మాజీ డ్రైవర్ పోలె రాజుతో కలిసి సుమారు ఎనిమిదేళ్లుగా నకిలీ ఆస్తి పత్రాల దందా సాగించినట్లు పోలీసులు గుర్తించారు. జీపీఏ, ఎస్‌పీఏ, సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్, మార్టేజ్ రిలీజ్ వంటి పత్రాలతోపాటు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారుల సంతకాలు, నకిలీ స్టాంపులు ఉపయోగించినట్లు తెలిపారు. పలు ప్రాంతాల్లోని విలువైన స్థలాలకు సంబంధించిన నకిలీ పత్రాలను తయారు చేసినట్లు వెల్లడించారు. ఎల్బీనగర్‌లోని ఓ ఫ్లాట్‌పై దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు 25 నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు, 41 నకిలీ రబ్బరు స్టాంపులు, పలు ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడిపై ఇప్పటికే తొమ్మిది కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# విజిల్ బ్లోయర్స్ సోషల్ మీడియా వింగ్



హైదరాబాద్, అక్టోబరు 9 : తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల తూటాలు రోజురోజుకూ మరింత పదునెక్కుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా బిఆర్ఎస్ అధినేతలు కేటీఆర్, హరీష్ రావులను లక్ష్యంగా చేసుకుని ల్యాండ్ కేటాయింపులు, ప్రాజెక్టుల నిర్వహణపై చేస్తున్న ఆరోపణలు మీడియా, సోషల్ మీడియా వేదికల్లో ట్రెండింగ్‌గా మారుతుండగా.. దానికి పోటీగా రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యుల ఆస్తులు, వ్యాపార లావాదేవీలపై బీఆర్ఎస్ చేసిన ఆరోపణలు మాత్రం ప్రజా చర్చగా మారడంలో విఫలమవుతున్నాయి. ఒక వైపు సీఎం విమర్శలకు కేటీఆర్, హరీష్ రావు సుదీర్ఘ ప్రెస్ మీట్లు పెట్టి వివరణలు ఇస్తుంటే, రేవంత్ రెడ్డి మాత్రం బీఆర్ఎస్ విమర్శలను పెద్దగా పట్టించుకోవడం లేదు. దీనికి ప్రధాన కారణం ఆరోపణలు గుప్పించే నాయకత్వ స్థాయి, కమ్యూనికేషన్ వ్యూహంలో ఉన్న వ్యత్యాసమేనని భావిస్తున్నారు. రేవంత్ రెడ్డి స్వయంగా మైక్ ముందుకొచ్చి నేరుగా కేటీఆర్, హరీష్ రావుల పేర్లను ప్రస్తావిస్తూ దాడి చేస్తుంటే, బీఆర్ఎస్ మాత్రం సీఎం కుటుంబంపై చేసే ఆరోపణలను పార్టీ సోషల్ మీడియా ఇన్చార్జ్ మన్నె క్రిషాంక్ ద్వారా డిజిటల్ వేదికలపైకి వదులుతోంది. కేటీఆర్, హరీష్ రావు లాంటి అగ్రనేతలు నేరుగా ముందుండి ఈ ఆరోపణలకు బాధ్యత తీసుకోకపోవడం వల్ల, ఇవి కేవలం సోషల్ మీడియా ఇన్చార్జ్ చేసే వ్యక్తిగత కామెంట్లు, పాయింట్లు లేని డిజిటల్ డ్రామా గా మాత్రమే జనాల్లోకి వెళుతున్నాయి. మరోవైపు, బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రచారంలో విశ్వసనీయత, ఆధారాల కొరత స్పష్టంగా కనిపిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రేవంత్ రెడ్డి కుటుంబ వ్యాపారాలు , ఆస్తులపై బీఆర్ఎస్ సోషల్ మీడియా వింగ్ విడుదల చేస్తున్న పోస్టులు, పేపర్ క్లిప్పింగులు క్షేత్రస్థాయి ఆధారాలతో కాకుండా ఆరోపణల స్థాయిలోనే ఉండిపోతున్నాయి. సరైన అధికారిక పత్రాలు లేకుండా ప్రతిరోజూ చేసే ఈ దాడి పట్ల సాధారణ ప్రజల్లో పొలిటికల్ సాచ్యురేషన్ పెరిగిపోవడంతో సోషల్ మీడియాలో కూడా వీటికి ఆశించిన స్పందన లభించడం లేదు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ , సీఎం రేవంత్ రెడ్డి ఈ ఆరోపణలకు సైలెంట్‌గా ఉండటం కూడా ఒక పక్కా వ్యూహంలో భాగమేనని విశ్లేషిస్తున్నారు. ప్రతిపక్షం నుంచి వచ్చే ప్రతి చిన్న విమర్శకూ సీఎం స్థాయిలో సమాధానం ఇస్తే, ఆ ఆరోపణకు అనవసరంగా హైప్ ఇచ్చినట్లవుతుందనేది కాంగ్రెస్ డిజిటల్ ప్లానర్స్ ఆలోచన. ప్రతిపక్ష నాయకులే రక్షణ ధోరణిలోకి వెళ్లి సుదీర్ఘ వివరణలు ఇస్తుండటంతో, రేవంత్ రెడ్డి ప్రభుత్వం సైలెంట్‌గా ఉంటూనే చట్టపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా ఆ వార్తలకు బ్రేక్ వేస్తోంది. బీఆర్ఎస్ చేస్తున్న మరొక ప్రధాన వ్యూహాత్మక తప్పిదం.. తమ పార్టీ అగ్రనాయకత్వం కాకుండా సోషల్ మీడియా వింగ్ నేతలను విజిల్ బ్లోయర్స్ గా ప్రాజెక్ట్ చేయడం! కేటీఆర్ లేదా హరీష్ రావు ప్రెస్ మీట్ పెట్టి ఆధారాలు బయటపెడితే వచ్చే పొలిటికల్ ఇంపాక్ట్ వేరుగా ఉంటుంది. కానీ ఇన్చార్జ్‌ల ద్వారా ఆరోపణలు చేయించి, ప్రభుత్వం వారిపై కేసులు పెట్టగానే ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు అంటూ కేటీఆర్ ట్వీట్లు చేయడం వల్ల.. ప్రజలకు ఇది కేవలం ఒక లీగల్ ,డిజిటల్ ఫైట్ లాగానే కనిపిస్తోంది తప్ప, నిరూపించబడిన పెద్ద స్కామ్‌లాగా అనిపించడం లేదని అనుకుంటున్నారు. విమర్శలకు పొలిటికల్ ఇమేజ్, స్పష్టమైన ఆధారాలు తోడైనప్పుడే అవి ప్రజల్లో నానుతాయి. రేవంత్ రెడ్డి విసురుతున్న పొలిటికల్ పంచ్‌లకు ప్రత్యక్షంగా కౌంటర్ ఇస్తూ రక్షణలో పడిపోయిన బీఆర్ఎస్, సీఎం కుటుంబంపై చేసే ఆరోపణల్లో మాత్రం రెండో శ్రేణి నాయకత్వాన్ని వాడటం ద్వారా పెద్ద వ్యూహాత్మక తప్పిదమే చేసింది. ఈ డిజిటల్ వార్తల్లో మైండ్ గేమ్‌ను గెలవాలంటే బీఆర్ఎస్ తన దాడి వ్యూహాన్ని, నాయకత్వ బాధ్యతను పూర్తిగా మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# తెలంగాణలోకి అకున్ సబర్వాల్




హైదరాబాద్, అక్టోబరు 9 : సీనియర్ ఐపీఎస్ అధికారి అకున్ సబర్వాల్ తిరిగి తెలంగాణ క్యాడర్‌లోకి రానున్నట్లు సమాచారం. దీంతో రాష్ట్ర పోలీసు, రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. కేంద్ర డిప్యుటేషన్ పూర్తి చేసుకున్న ఆయనకు త్వరలో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందన్న ప్రచారం నేపథ్యంలో.. గతంలో ఆయన చేపట్టిన సంచలనాత్మక టాలీవుడ్ డ్రగ్స్ కేసు మరోసారి తెరపైకి వచ్చింది. 2017లో హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన డ్రగ్స్ రాకెట్ దర్యాప్తులో అప్పటి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్న అకున్ సబర్వాల్ కీలక పాత్ర పోషించారు. ఆయన నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం పలువురు సినీ ప్రముఖులను విచారించింది. అప్పట్లో ఎల్ఎస్‌డీ,ఎండీఎంఏ వంటి మాదకద్రవ్యాల సరఫరా వ్యవహారం హైదరాబాద్‌లో సంచలనం సృష్టించింది. డ్రగ్ పెడ్లర్ల అరెస్టుల అనంతరం వారి కాంటాక్ట్ లిస్టుల్లో సినీ ప్రముఖుల ఫోన్ నంబర్లు ఉన్నాయన్న అంశం ఆధారంగా పలువురికి నోటీసులు ఇచ్చి విచారించారు. అయితే కేవలం ఫోన్ నంబర్లు ఉండటం, పరిచయం ఉండటం మాత్రమే నేరానికి ఆధారం కాదని దర్యాప్తు సంస్థలు స్పష్టం చేశాయి. అప్పట్లో సినీ పరిశ్రమను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నారన్న విమర్శలను సబర్వాల్ కూడా ఖండించారు. తదుపరి దశలో ఈ కేసుల దర్యాప్తు తీరుపై పలు ప్రశ్నలు తలెత్తాయి. 2024లో ఈ వ్యవహారానికి సంబంధించిన ఆరు కేసులను తగిన ఆధారాలు లేవన్న కారణంతో కోర్టు కొట్టివేసినట్లు నివేదికలు వెల్లడించాయి. దర్యాప్తులో అనుసరించాల్సిన విధానాలు పాటించలేదని, కొన్ని కేసుల్లో సరైన సాక్ష్యాలు లేవని కోర్టు పేర్కొన్నాయి. ఇక అంతకు ముందే అకున్ సబర్వాల్ కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లిపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన తిరిగి తెలంగాణకు రావడం సహజంగానే పాత కేసుపై ఆసక్తిని పెంచుతోంది. అయితే ఆయన రాకతో డ్రగ్స్ కేసును ప్రభుత్వం తిరిగి తెరుస్తుందనే ప్రచారం జరుగుతోంది. దాంతో పాటు ఆయనకు ఎలాంటి పోస్టింగ్ ఇస్తారన్నది కూడా చర్చనియాంశంగా మారింది. రేవంత్ సర్కార్ డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపుతుండగా.. తిరిగి అదే బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందన్న చర్చ కూడా నడుస్తోంది. ఒకవేళ ఆయనకు ఆ బాధ్యతలనే అప్పగిస్తే.. అప్పటి దర్యాప్తులో నమోదైన అంశాలను కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి సమీక్షిస్తుందా ? దర్యాప్తులో ప్రస్తావనకు వచ్చిన పేర్లపై మరింత లోతైన విచారణకు అవకాశం ఉంటుందా ? అప్పట్లో రాజకీయ, సినీ వర్గాల్లో చర్చకు వచ్చిన ఇతర పేర్లు ఏమైనా అధికారిక దర్యాప్తు రికార్డుల్లో ఉన్నాయా ? ఉంటే వాటి వివరాలు ప్రజలకు వెల్లడవుతాయా ? అన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మొత్తంగా అకున్ సబర్వాల్ రీఎంట్రీతో పాత డ్రగ్స్ కేసు రాజకీయ రంగు పులుముకుంటుందా, లేక ఇది కేవలం ఒక సీనియర్ అధికారి క్యాడర్ రిటర్న్‌గానే మిగిలిపోతుందా అన్నది రానున్న రోజుల్లో స్పష్టమవుతుంది. ఆయనకు లభించే పోస్టింగ్, ప్రభుత్వం తీసుకునే తదుపరి నిర్ణయాలు ఈ చర్చకు మరింత ఊతమిచ్చే అవకాశం ఉంది. ఇక అకున్ సబర్వాల్ సతీమణి సీనియర్ ఐఏఎస్ స్మితా సబర్వాల్ వ్యక్తిగత కారణాలతో లాంగ్ లీవ్‌లో ఉన్న విషయం తెలిసిందే.

# భారతీయులకు ట్రంప్ మరో షాక్...



హైదరాబాద్, అక్టోబరు 9 : అమెరికాలో పనిచేస్తున్న విదేశీ టెక్ నిపుణులకు, ముఖ్యంగా భారతీయ ఐటీ రంగానికి అమెరికా ప్రభుత్వం ఊహించని షాక్ ఇచ్చింది. విదేశీ ఉద్యోగులకు గ్రీన్ కార్డ్ మంజూరు ప్రక్రియలో కీలకమైన పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ నుంచి ప్రపంచ ప్రఖ్యాత ఐటీ అవుట్‌సోర్సింగ్ దిగ్గజాలను సస్పెండ్ చేస్తూ ట్రంప్ యంత్రాంగం సంచలన నిర్ణయం తీసుకుంది. అమెరికన్ల ఉద్యోగాలను కొల్లగొడుతున్నారన్న ఆరోపణలతో ఈ కఠిన చర్యలు చేపట్టింది. జాబితాలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ , ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్, కాగ్నిజెంట్, కాప్‌జెమినిలతో పాటు ప్రముఖ టెక్ సంస్థలు మైక్రోసాఫ్ట్, అడోబ్ కూడా ఉన్నాయని అమెరికా కార్మిక శాఖ స్పష్టం చేసింది. అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ నేతృత్వంలోని యాంటీ ఫ్రాడ్ టాస్క్‌ఫోర్స్ సమక్షంలో వైట్‌హౌస్ వేదికగా ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఇకపై ఈ కంపెనీల నుంచి ఎలాంటి కొత్త పెర్మ్ దరఖాస్తులను స్వీకరించబోమని, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను కూడా పూర్తిగా నిలిపివేస్తున్నామని వెల్లడించారు. పెర్మ్ ప్రక్రియ అంటే.. అమెరికాలో ఒక కంపెనీ విదేశీ ఉద్యోగికి గ్రీన్ కార్డ్ ఇః-2, ఇః-3 కేటగిరీలు స్పాన్సర్ చేయాలంటే, మొదటగా కార్మిక శాఖ నుంచి ఈ లేబర్ సర్టిఫికేషన్ పొందడం తప్పనిసరి చట్టబద్ధమైన మొదటి మెట్టు. సదరు ఉద్యోగం చేసేందుకు స్థానికంగా అర్హులైన అమెరికన్ పౌరులు ఎవరూ అందుబాటులో లేరని, విదేశీయుడిని తీసుకోవడం వల్ల అమెరికన్ వర్కర్ల వేతనాలపై ప్రతికూల ప్రభావం పడటం లేదని కంపెనీలు సాక్ష్యాధారాలతో కార్మిక శాఖకు నిరూపించాల్సి ఉంటుంది. కార్మిక శాఖ ఈ సర్టిఫికేట్‌ను ఆమోదించిన తర్వాతే కంపెనీలు యూఎస్‌సీఐఎస్ వద్ద ఐ-140 పిటిషన్ దాఖలు చేయగలవు. ఇప్పుడు ఈ ప్రధాన మార్గాన్నే నిలిపివేయడంతో, ఈ కంపెనీలు తమ విదేశీ ఉద్యోగుల తరఫున కొత్తగా గ్రీన్ కార్డ్ ప్రక్రియను ప్రారంభించే అర్హతను తాత్కాలికంగా కోల్పోయినట్లయింది. అమెరికా అధికార యంత్రాంగం ఈ కఠిన చర్యకు దిగడానికి హెచ్-1బీ , పెర్మ్ నిబంధనల దుర్వినియోగమే ప్రధాన కారణమని స్పష్టం చేసింది. గత కొన్నేళ్లుగా ఈ దిగ్గజ ఔట్‌సోర్సింగ్ సంస్థలు దాదాపు 30 లక్షల మంది విదేశీ నిపుణుల కోసం దరఖాస్తులు చేశాయని, 2.3 లక్షలకు పైగా హెచ్-1బీ అప్రూవల్స్, లక్షకు పైగా పెర్మ్ సర్టిఫికేషన్లు పొందాయని యూఎస్ కార్మిక శాఖ పేర్కొంది. అమెరికన్ వర్కర్లకు సమాన అవకాశాలు కల్పించకుండా స్థానిక ఉద్యోగాలను కొల్లగొట్టేలా లేబర్ మార్కెట్ నిబంధనలను ఉల్లంఘించారని, ఫెడరల్ దర్యాప్తులు ఎదుర్కొంటున్నందున ఈ సస్పెన్షన్ వేటు వేశామని వివరించింది. తాజా చర్యలు అమెరికన్ నిరుద్యోగుల హక్కులను కాపాడేందుకేనని ప్రభుత్వం సమర్థించుకుంది. ఈ నిర్ణయం అమెరికాలోని భారతీయ ఐటీ నిపుణులకు, గ్రీన్ కార్డ్ ఆశావహులకు తీరని ఎదురుదెబ్బగా పరిణమించనుంది. ఈ సంస్థల్లో పనిచేస్తూ ఇప్పటికే పెర్మ్ అనుమతుల కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్న వేలాది మంది భారతీయ టెక్కీల భవిష్యత్తు ఒక్కసారిగా అనిశ్చితిలో పడింది. కొత్తగా దరఖాస్తులు ఆగిపోవడంతో పాటు, పెండింగ్ ఫైల్స్ కూడా నిలిచిపోవడం వల్ల గ్రీన్ కార్డ్ ప్రాసెసింగ్ మరింత తీవ్ర జాప్యానికి గురవుతుంది. ఇది భారత ఐటీ కంపెనీల వ్యాపార కార్యకలాపాలు, ఆన్-సైట్ డిప్లాయ్‌మెంట్ వ్యూహాలపై ప్రభావం చూపే అవకాశముంది. అమెరికా అధికారులు ఈ కంపెనీల అంతర్గత విధానాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించి, సస్పెన్షన్‌ను ఎత్తివేసే వరకు ఈ సంస్థల్లోని ఉద్యోగులకు గ్రీన్ కార్డ్ మొదటి అడుగు పడటం అసాధ్యంగా మారనుంది.

# మలుపులు తిరుగుతున్న రాజకీయం రేవంత్ టార్గెట్ గా కేటీఆర్ 'ఓపెన్ లెటర్స్'



హైదరాబాద్, అక్టోబరు 9 : తెలంగాణ రాజకీయం ప్రతిరోజూ కొత్త మలుపులు తిరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనా నిర్ణయాలు, వివాదాస్పద వ్యాఖ్యలు, బిఆర్ఎస్ శ్రేణులపై జరుగుతున్న పోలీసు కేసుల విచారణల సందర్భంలో.. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పదే పదే కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖలు రాయడం , ఎక్స్ వేదికగా నేరుగా ట్యాగ్ చేస్తూ రేవంత్‌ను అదుపులో పెట్టుకోండి అని డిమాండ్ చేయడం చర్చనీయాంశమవుతోంది. అయితే, కాంగ్రెస్ అధిష్ఠానానికి అత్యంత సన్నిహితుడిగా, తెలంగాణలో పార్టీని అధికారంలోకి తెచ్చిన సీఎం రేవంత్ రెడ్డిపై ప్రత్యర్థి పార్టీ నాయకుడు ఫిర్యాదు చేస్తే రాహుల్ గాంధీ చర్యలు తీసుకుంటారా అంటే.. అసలు అటువంటి అవకాశమే లేదనేది అందరికీ తెలిసిన సత్యం. మరి లాజిక్‌కు అందని ఈ ఫిర్యాదుల వ్యూహం వెనుక కేటీఆర్ , బిఆర్ఎస్ ఆశిస్తున్న అసలు రాజకీయం ఏమిటి?కేటీఆర్ లక్ష్యం రాహుల్ గాంధీ ద్వారా రేవంత్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకునేలా చేయడం కాదు. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ ప్రచారం చేసే భారత రాజ్యాంగ పరిరక్షణ , ప్రజాస్వామ్య విలువలు , వ్యక్తి స్వేచ్ఛ అనే సిద్ధాంతాలలోని నైతిక వైరుధ్యాన్ని జాతీయ స్థాయిలో ఎండగట్టడమే బిఆర్ఎస్ ప్రధాన వ్యూహం. ఢిల్లీలో ప్రజాస్వామ్యం గురించి ఉపన్యాసాలు ఇచ్చే రాహుల్ గాంధీ, తెలంగాణలో తమ సీఎం రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ సోషల్ మీడియా నేతలను అరెస్ట్ చేస్తుంటే , విపక్షాల ప్రతినిధులపై కేసులు పెడుతుంటే ఎందుకు మౌనంగా ఉంటున్నారనే ప్రశ్నను కేటీఆర్ సమాజం ముందుకు తెస్తున్నారు. ఈ వ్యూహంలో ఉన్న మరో కీలకమైన అంశం.. నైతిక బాధ్యత ను అధిష్ఠానం భుజాన పెట్టడం. రేవంత్ రెడ్డి చేసే వ్యాఖ్యలు , నిర్ణయాలు కాంగ్రెస్ పార్టీ అధికారిక విధానమా కాదా అని ప్రశ్నించడం ద్వారా, రేవంత్ చర్యలకు రాహుల్ గాంధీ కూడా నైతిక బాధ్యత వహించక తప్పని పరిస్థితిని బిఆర్ఎస్ కల్పిస్తోంది. రాహుల్ గాంధీ ఈ ఫిర్యాదులపై స్పందించకపోయినా లేదా మౌనంగా ఉన్నా.. అది రేవంత్ నిర్ణయాలకు రాహుల్ మద్దతు ఉందనే సంకేతం అని, కాంగ్రెస్ మార్క్ సిద్ధాంతాలు కేవలం ప్రచారానికేనని నెటిజన్లలో ప్రచారం చేయడానికి బిఆర్ఎస్‌కు ఒక బలమైన లీడ్ లభిస్తోంది. దీనికితోడు, తెలంగాణ రాజకీయాలను కేవలం హైదరాబాద్ బోర్డర్లకే పరిమితం చేయకుండా జాతీయ మీడియా , ఢిల్లీ రాజకీయ వర్గాల్లోకి తీసుకెళ్లడానికి ఈ 'ఓపెన్ లెటర్స్' వ్యూహం తోడ్పడుతోంది. ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీని నేరుగా ట్యాగ్ చేస్తూ లేఖలు రాసినప్పుడు లేదా విమర్శలు చేసినప్పుడు నేషనల్ మీడియా కూడా దీనిపై దృష్టి సారిస్తోంది. దీనివల్ల తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వచ్చే విమర్శలు, ఆరోపణలు జాతీయ స్థాయిలో హైలైట్ అయ్యి కాంగ్రెస్ ఇమేజ్‌ను దెబ్బతీసే అవకాశం ఏర్పడుతోంది. అలాగే, కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విభేదాలు, సీనియర్ నేతల అసంతృప్తిపై మానసిక ఒత్తిడి పెంచడం కూడా ఇందులో దాగి ఉన్న మరో ప్లాన్. సీఎం రేవంత్ రెడ్డి వైఖరిపై ఢిల్లీ పెద్దలకు ఫిర్యాదులు వెళ్లడం వల్ల, కాంగ్రెస్‌లోని రేవంత్ వ్యతిరేక వర్గానికి లేదా పాతకాపులకు ఒక రకమైన రాజకీయ మద్దతు లభిస్తుందని, అది కాంగ్రెస్ అంతర్గత విభేదాలను మరింత ఉద్రేకపరుస్తుందని బిఆర్ఎస్ భావిస్తోంది. మరోవైపు, ఈ ఫిర్యాదులపై కాంగ్రెస్ శ్రేణులు , సీఎం రేవంత్ రెడ్డి చాలా తేలికగా స్పందిస్తున్నారు. ప్రత్యర్థి ఫిర్యాదులను చూసి ఏ హైకమాండ్ కూడా తమ ప్రజాదరణ ఉన్న ముఖ్యమంత్రిని తప్పు పట్టదని, కేటీఆర్ కేవలం సోషల్ మీడియా పబ్లిసిటీ మరియు కవరేజ్ కోసమే ఇటువంటి డ్రామాలు ఆడుతున్నారని కాంగ్రెస్ డిజిటల్ వింగ్ తిప్పికొడుతోంది. కేటీఆర్ రాహుల్ గాంధీకి చేసే ఫిర్యాదులు రేవంత్ రెడ్డి పదవిని ఊడగొట్టడానికి కాదని, రాహుల్ గాంధీ నైతికతను ప్రశ్నించడం ద్వారా జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌ను డిఫెన్స్‌లో పడేయడానికి వేస్తున్న ఒక తెలివైన పొలిటికల్, మీడియా గేమ్ అని బీఆర్ఎస్ నేతలంటున్నారు.

# ఓటర్ల నమోదుకు పెద్ద ఎత్తున అప్లికేషన్లు

హైదరాబాద్, అక్టోబరు 9 : తెలంగాణలో ఎస్ఐఆర్ కీలక దశకు చేరుకుంది. యువ ఓటర్లు, కొత్తగా అర్హత పొందిన పౌరులతో పాటు విదేశాల్లో ఉన్న భారతీయుల నుంచి కూడా భారీగా దరఖాస్తులు వచ్చాయి. మరోవైపు అడ్రస్ మార్పులు, పేర్లు, ఇతర వివరాల సవరణ కోసం పెద్ద సంఖ్యలో అభ్యర్థనలు నమోదయ్యాయి. ఓటర్ల పేర్ల తొలగింపుపై వచ్చిన అభ్యంతరాలను కూడా ఎన్నికల అధికారులు పరిశీలిస్తున్నారు. హైదరాబాద్ జిల్లా నుంచి కొత్త ఓటు నమోదుకు వచ్చిన దరఖాస్తుల సంఖ్య ప్రత్యేకంగా గణనీయంగా ఉంది. అనంతరం నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది. తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా కొత్త ఓటు కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 4,88,417 ఫామ్-6 దరఖాస్తులు అందినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. అలాగే విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల నుంచి 6,270 ఫామ్-6ం దరఖాస్తులు వచ్చాయి. ఓటర్ల వివరాల్లో మార్పులు, చిరునామా సవరణలు వంటి అంశాల కోసం 5,04,782 ఫామ్-8 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఇదే సమయంలో ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపుపై అభ్యంతరాలు, తొలగింపు అభ్యర్థనల కోసం ఫామ్-7లు కూడా వేల సంఖ్యలో వచ్చాయి. ఫామ్-7 ద్వారా ఇప్పటికే ఉన్న ఓటరు పేరును తొలగించాలన్న అభ్యంతరాలు, తొలగింపు అభ్యర్థనను దాఖలు చేయవచ్చు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా దాఖలైన క్లెయిమ్‌లు, అభ్యంతరాల గడువు అక్టోబర్ 7వ తేదీతో ముగిసింది. వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలను పరిశీలించి నవంబర్ 5వ తేదీ వరకు పరిష్కరించనున్నారు. ఆ తర్వాత నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఎన్నికల జాబితా సవరణకు సంబంధించిన ఈ షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ముందుగానే ప్రకటించింది. జిల్లాల వారీగా చూస్తే కొత్త ఓటు నమోదు కోసం అత్యధిక దరఖాస్తులు హైదరాబాద్ జిల్లా నుంచి వచ్చినట్లు ఎన్నికల కార్యాలయం వెల్లడించింది. హైదరాబాద్ పరిధిలోని 15 నియోజకవర్గాల్లో 1,93,135 ఫామ్-6 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 29,226 దరఖాస్తులు ఇప్పటికే ఆమోదం పొందినట్లు సమాచారం. అలాగే హైదరాబాద్ జిల్లా నుంచి 4,127 మంది ఎన్ఆర్ఐలు ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. చిరునామా, ఇతర వివరాల మార్పు కోసం 1,44,495 ఫామ్-8 దరఖాస్తులు అందాయి. ఓటర్ల తొలగింపు అంశంలో హైదరాబాద్ జిల్లా కూడా చర్చనీయాంశంగా మారింది. ఫామ్-7ల దాఖలాపై హైదరాబాద్ నగరంలో రాజకీయ వివాదం నెలకొన్న నేపథ్యంలో ఎన్నికల అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ఇటీవల బల్క్‌గా సమర్పించిన ప్రీ-ఫిల్డ్ ఫామ్-7ల వ్యవహారం కూడా వెలుగులోకి వచ్చింది. అయితే ఎన్నికల అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత తుది ఓటర్ల జాబితాలో ఓటర్ల సంఖ్య గణనీయంగా మారే అవకాశం ఉందని తాజా రిపోర్టులు సూచిస్తున్నాయి. ఇప్పటికే కోట్లాది మంది ఓటర్ల వివరాలను పరిశీలించి తుది జాబితాలో చేర్చేందుకు అధికారులు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. నవంబర్ 9వ తేదీన వెలువడే తుది జాబితాతో రాష్ట్రంలోని ఓటర్ల సంఖ్యపై స్పష్టత రానుంది. కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నవారు, తమ వివరాల్లో మార్పులు కోరినవారు తుది జాబితా ప్రచురణ తర్వాత.. తమ పేరు, వివరాలు ఓటర్ల జాబితాలో సరిగ్గా నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవడం కీలకమని ఎన్నికల సంఘం అధికారులు పేర్కొంటున్నారు.




# క్యూట్‌నెస్ రీలోడెడ్.. త్రిధా చౌదరి!



టాలీవుడ్‌లో యువ హీరోల సరసన నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అందాల తార త్రిధా చౌదరి. క్యూట్ లుక్స్‌తో టాలీవుడ్ ప్రేక్షకులను అలరిస్తున్న ఈ భామ, ఒకప్పుడు స్టార్ హీరోయిన్ త్రిష లేని లోటును భర్తీ చేసేలా ఉందంటూ సోషల్ మీడియాలో అభిమానులు ప్రశంసిస్తున్నారు. కేవలం గ్లామరస్ పాత్రలకే పరిమితం కాకుండా.. వరుస చిత్రాలతో పాటు వైవిధ్యమైన వెబ్ సిరీస్‌ల ద్వారా తన ఇమేజ్‌ను మరింత పెంచుకునే పనిలో పడ్డారు. ప్రయోగాత్మక సిరీస్‌లలో ఈ బ్యూటీ కనబరిచిన అత్యుత్తమ నటన ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. మరోవైపు సామాజిక మాధ్యమాలలోను త్రిధా జరంత స్పీడ్ మీద ఉంది. ఇటీవల త్రిధా చౌదరి షేర్ చేసిన ఒక లేటెస్ట్ బ్లూ-థీమ్డ్ అఫీషియల్ గ్లామర్ లుక్ ఫోటోషూట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ ఫోటోగ్రాఫ్ కి ఫ్యాన్స్ నుంచి స్పందనలు అనూహ్యం. --సీఈవో ఆఫ్ హెర్ వోన్ లిటిల్ యూనివర్స్-- అనే ఆసక్తికరమైన క్యాప్షన్‌తో త్రిధ షేర్ చేసిన ఈ పోస్ట్ కుర్రకారును విపరీతంగా ఆకట్టుకుంటోంది. త్రిధ సోషల్ మీడియా ప్రొఫైల్‌లో కనిపిస్తున్న ఈ స్టైల్, కాన్ఫిడెన్స్ .. ఇండిపెండెంట్ పర్సనాలిటీకి అభిమానులు ఫిదా అవుతున్నారు. ఈ పోస్ట్‌కు నెటిజన్ల నుంచి భారీ స్పందన లభించడమే కాక .. కామెంట్ సెక్షన్ అభిమానుల ప్రేమతో నిండిపోయింది. ఈ బ్యూటీ పోస్ట్‌లపై స్పందిస్తూ ఫ్యాన్స్ తనను -బాస్ లేడీ- అని, -ఫ్రెష్ ఎయిర్ ఫర్ ది సోల్- అని కొనియాడుతున్నారు. కేవలం అందం మాత్రమే కాకుండా తనదైన శైలిలో సానుకూల విషయాలను షేర్ చేస్తూ డిజిటల్ కమ్యూనిటీతో ఎప్పుడూ టచ్‌లో ఉంటున్నారు. తెరపై ఎంత గ్లామర్‌గా కనిపిస్తారో.. నిజ జీవితంలోనూ అంతే పరిణతితో కూడిన ఆలోచనలు, సెల్ఫ్-యాక్సెప్టెన్స్ మ్యాటర్స్ లో యువతకు స్ఫూర్తినిస్తున్నారు. ఆకర్షణీయమైన రూపంతో పాటు చక్కటి వ్యక్తిత్వం త్రిధాను ఇండస్ట్రీలో ప్రత్యేకంగా నిలబెడుతోంది. ఇక కెరీర్ పరంగా చూస్తే.. 2026లో త్రిధా చౌదరి పలు క్రేజీ ప్రాజెక్ట్‌లతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. బాలీవుడ్, టాలీవుడ్, బెంగాలీ పరిశ్రమలలో దూసుకుపోతున్న ఈ భామ గతంలో ఆశ్రమ్, బందిష్ బండిట్స్ వంటి సూపర్ హిట్ వెబ్ సిరీస్‌లతో సంచలనం సృష్టించారు. ఈ ఏడాది (2026)లో నటిస్తున్న పలు చిత్రాలు, వెబ్ ప్రాజెక్ట్‌లు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా ట్రెండింగ్ ప్రాజెక్ట్‌లు..మోస్ట్ అవేటెడ్ -ఆశ్రమ్- కొత్త సీజన్ షూటింగ్ విశేషాలతో త్రిధా పేరు మరోసారి సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ాశ్రీంశీ =ఘుం - 'హనుమాన్ అంశ్' మూవీ రివ్యూ వెండితెరపై తన అభినయంతో, డిజిటల్ వేదికలపై గ్లామర్ ఫోటోషూట్‌లతో నిత్యం ట్రెండింగ్‌లో ఉండే త్రిధా చౌదరి.. మునుముందు మరింత వైవిధ్యమైన పాత్రలతో తన మార్కును చూపించడానికి సిద్ధమవుతున్నారు. నటనలో త్రిధా అంకితభావం.. ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని కోరుకునే తత్వమే ఆమెను ప్రేక్షకుల అభిమాన తారగా నిలబెడుతోంది. భవిష్యత్ ప్రాజెక్ట్‌లతో ఈ బ్యూటీ మరింత విజయవంతమైన మైలురాళ్లను అందుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# 'కామ్రేడ్ కళ్యాణ్' మూవీ రివ్యూ




సీరియస్ సినిమాలతో మొదలుపెట్టి.. కామెడీ వైపు టర్న్ అయి.. 'కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్' అనే ట్యాగ్ తెచ్చుకున్నాడు శ్రీవిష్ణు. సామజవరగమన.. సింగిల్.. శ్వాగ్ లాంటి చిత్రాలతో అలరించిన అతను.. ఇప్పుడు 'కామ్రేడ్ కళ్యాణ్' అవతారం ఎత్తాడు. ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రంతో శ్రీవిష్ణు అలరించాడా? చూద్దాం పదండి. కథ: కళ్యాణ్ (శ్రీవిష్ణు) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తొంభైవ దశకంలో నక్సల్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న మాడుగుల అనే ఊరికి చెందిన కుర్రాడు. అక్కడ ఒక థియేటర్ లీజుకు తీసుకుని నడిపిస్తుంటాడు. ఆ ఊరికి కొత్తగా వచ్చిన ఒరియా అమ్మాయి సితార దేవి (మహిమ నంబియార్)తో అతను ప్రేమలో పడతాడు. తర్వాత ఆమె తెలుగమ్మాయే అని.. ఒక పెద్ద సమస్యలో చిక్కుకుని ఆ ఊరికి వచ్చిందని తెలుస్తుంది. ఆమెను ఆ సమస్య నుంచి బయటపడేయడం కోసం అనూహ్యంగా నక్సలైట్ అవతారం ఎత్తాల్సి వస్తుంది కళ్యాణ్. సింపుల్ అనుకున్న విషయం కాస్తా సీరియస్ అయి అతను అడవుల్లో అన్నలతో పాటు అడుగు వేయాల్సిన పరిస్థితి వస్తుంది. ఇంతకీ సితారకు వచ్చిన సమస్యేంటి.. దానికి కళ్యాణ్ నక్సలైట్ కావడానికి సంబంధమేంటి.. ఈ ఉచ్చు నుంచి అతను బయటపడ్డాడా లేదా అన్నది మిగతా కథ. నక్సలిజం అన్నది చాలా సీరియస్.. సెన్సెటివ్ సబ్జెక్ట్. హీరో ఆ అవతారం ఎత్తాడంటే ఆ కథ నడిచే టోనే వేరుగా ఉంటుంది. కానీ శ్రీ విష్ణు ఏమో ఈ మధ్య వరుసగా కామెడీ సినిమాలు చేస్తున్న హీరో. ఉన్నట్లుండి అతను ఇంత సీరియస్ పాత్ర ఎందుకు చేస్తున్నాడబ్బా అనుకున్నారంతా. కానీ తీరా చూస్తే ఇది కూడా కామెడీ సినిమానే అని ప్రోమోలు క్లారిటీ ఇచ్చాయి. మరి సీరియస్ సబ్జెక్టులో కామెడీ ఎలాగబ్బా అనే సందేహాల మధ్య 'కామ్రేడ్ కళ్యాణ్ థియేటర్లో కూర్చుంటే.. ఈ కథ కొంచెం మింగుడుపడనట్లే సాగుతుంది. నక్సలైట్లు ఇంత సిల్లీగా వ్యవహారాలు నడుపుతారా.. పోలీసులు ఇంత డమ్మీగా ఉంటారా.. ఒక మామూలు కుర్రాడు ఇద్దరితో ఇలా ఆడేసుకుంటాడా అనిపించేలా ఇందులో కథ నడుస్తుంది. కానీ కథ-పాత్రల గురించి ఎక్కువ ఆలోచించకుండా.. లాజిక్కులేమీ పట్టించుకోకుండా.. కేవలం కామెడీ మీదే ఫోకస్ చేసి నవ్వుకుంటాం అంటే మాత్రం శ్రీవిష్ణు అండ్ గ్యాంగ్ టైంపాస్ వినోదాన్ని అందిస్తుంది. 'కామ్రేడ్ కళ్యాణ్'లో నక్సలిజంను కామెడీగా ఏమీ చూపించలేదని.. సిచువేషన్లన్నీ సీరియస్ గానే ఉంటాయని.. కానీ చూసే ప్రేక్షకులకు మాత్రం ఫన్నీగా అనిపించి నవ్వుకుంటారని చెప్పాడు శ్రీవిష్ణు. ఐతే తను చెప్పినంత సీరియస్ గా ఏమీ ఈ కథ నడవలేదు. ఛలా కన్వీనియెంట్ గా.. చాలా తేలికగా కథను నడపించారిందులో. తన అవసరం కోసం అనుకోకుండా నక్సలైట్ వేషంవేసిన హీరో.. ఒరిజినల్ నక్సలైట్లు-పోలీసుల మధ్య చిక్కుకుని నానా తంటాలు పడే ఈ సినిమా లైన్ నిజానికి భలే ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. ఈ లైన్ ను పకడ్బందీగా చెబితే.. 'కామ్రేడ్ కళ్యాణ్' క్రేజీ మూవీ అయ్యేది. కానీ లైన్ బాగున్నప్పటికీ.. ఈ వ్యవహారాన్ని అవసరమైన తీవ్రతతో చూపించలేదు. కామెడీ సినిమాలో ఇంటెన్సిటీ ఎందుకు అనిపించొచ్చు. కానీ శ్రీవిష్ణు చెప్పినట్లు ఆ సీరియస్నెస్ ఉంటేనే కథ పండుతుంది. సిచువేషన్ ను సీరియస్ గా చూపించి అందులోంచి నవ్వులు పండించవచ్చు. కానీ 'కామ్రేడ్ కళ్యాణ్' రైటర్లు కానీ.. దర్శకుడు కానీ.. ఈ కథను ఎక్కడా సీరియస్ గా చెప్పే ప్రయత్నం చేయలేదు. కథనంతా కూడా కామెడీగానే డీల్ చేశారు. దాని వల్ల భలేగా అనిపించాల్సిన సినిమా కాస్తా.. జస్ట్ ఓకే అనిపించేలా తయారైంది. తన జీవితాన్నే రిస్కులో పెట్టుకుని హీరో నక్సలైట్ అయిపోవడానికి ఇందులో బలమైన కారణం కనిపించదు. హీరోయిన్ కోసం ఇదంతా చేస్తాడని చూపిస్తారు కానీ.. ఆమెతో అతడి ప్రేమకథను సరిగా బిల్డ్ చేయకపోవడం.. హీరో ఆ నిర్ణయం తీసుకోవడం వెనుక బలమైన ఎమోషన్ లేకపోవడం వల్ల ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకోలేం. ఇక నక్సలైట్లలో కలిసిపోయాక హీరో వేసే ఎత్తుగడలు.. దానికి దళం నాయకులు స్పందించే తీరు.. నక్సలైట్లను పట్టుకోవడానికి పోలీసులు చేసే ప్రయత్నాలు.. మంత్రి గారి కిడ్నాప్ వ్యవహారం.. వేటినీ సీరియస్ గా తీసుకోని విధంగా.. కొంచెం సిల్లీగా నడిపించారు. కానీ కథ-పాత్రలు ఎలా ఉన్నాయన్నది పక్కనపెడితే.. 'కామ్రేడ్ కళ్యాణ్'లో కామెడీ డోస్ కు అయితే ఢోకా లేదు. ముందే అన్నట్లు లాజిక్కులు పక్కన పెట్టి ఇందులో కామెడీ పంచులను ఎంజాయ్ చేయొచ్చు. శ్రీవిష్ణు క్యారెక్టర్ నుంచి ప్రేక్షకులు ఆశించే సెటైరికల్ ఫన్ ఇందులో కూడా వర్కవుట్ అయింది. అతడి వన్ లైనర్స్ బాగా పేలాయి. సత్య రూపంలో అతడికి భలే తోడు దొరికాడు. ఇద్దరూ కలిసి కొన్ని సీన్లలో భలే కామెడీ చేశారు. శ్రీ విష్ణు కోసం సత్య రాసే ఇంగ్లిల్ లవ్ లెటర్ సీన్.. శ్రీవిష్ణు-సత్య నక్సలైట్ల మధ్య చిక్కుకున్నాక పడే పాట్ల నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు.. హిలేరియస్ గా అనిపిస్తాయి. ఇద్దరూ తమదైన కామెడీ టైమింగ్ తో ప్రేక్షకులను నవ్విస్తారు. వారి కెమిస్ట్రీ బాగా వర్కవుట్ అయింది. ముఖ్యంగా సూపర్ ఫాంలో ఉన్న సత్య.. మరోసారి చక్కిలిగింతలు పెట్టాడు. తన పాత్ర బ్గగానే పేలింది. వెన్నెల కిషోర్ ఉన్నది ఒక్క సీన్లోనే అయినా.. మాస్ మెచ్చే కామెడీతో అలరించాడు. శ్రీవిష్ణు తన మీద తాను పంచ్ వేసుకోవడమే కాదు.. అతడితో పాటు ఇండస్ట్రీ జనాల మీద.. వేరే సినిమాల రెఫరెన్సులతో వేసిన పంచులు పేలాయి. టామ్ షైన్ చాకో పోలీస్ క్యారెక్టర్ అంటే చాలా ఊహించుకుంటాం కానీ.. దాన్ని సరిగా డిజైన్ చేయలేదు. అది ఇటు కామెడీగానూ లేక.. అటు అంత సీరియస్ గానూ సాగక అంతగా ఇంపాక్ట్ వేయలేకపోయింది. తొలి గంటలో కొన్ని కామెడీ సీన్ల వరకు ఓకే అనిపించే 'కామ్రేడ్ కళ్యాణ్' ఇంటర్వెల్ దగ్గర క్యూరియాసిటీ రేకెత్తిస్తుంది. కానీ దాన్ని నిలబెట్టే స్థాయిలో ద్వితీయార్ధం సాగలేదు. పడుతూ లేస్తూ సాగే ద్వితీయార్ధంలో కూడా అక్కడక్కడా కామెడీ వర్కవుట్ అయింది. చివరికి ఓ సందేశంతో ముగిసే 'కామ్రేడ్ కళ్యాణ్' అంత గొప్ప అనుభూతిని ఇవ్వదు. అలా అని ఇది బోర్ కొట్టించే సినిమా కూడా కాదు. ఎక్కువ అంచనాలు పెట్టుకోకుండా టైంపాస్ వినోదం కోసమైతే ఒక లుక్కేయొచ్చు. నటీనటులు: శ్రీవిష్ణు కామెడీ టైమింగ్ కు బాగా కుదిరే పాత్రే పడింది 'కామ్రేడ్ కళ్యాణ్'లో. తన వరకు ప్రతి సన్నివేశంలోనూ ఎంటర్టైన్ చేశాడు. తన నుంచి ఆశించే వినోదాన్ని అతను ఇచ్చేశాడు. కొన్ని సన్నివేశాల్లో ఎమోషన్లను కూడా బాగా పలికించాడు. మహిమ నంబియార్ చూడ్డానికి బాగుంది. నటన కూడా ఓకే. తన పాత్ర అంత బలంగా లేకపోయినా.. మహిమ పెర్ఫామెన్స్ అయితే బాగానే సాగింది. సత్య ఈ సినిమాకు పెద్ద ఆకర్షణగా మారాడు. కొన్ని సన్నివేశాల్లో శ్రీవిష్ణును మించి నవ్వించాడు. తన హావభావాలు.. పంచులు బాగా పేలాయి. సుదర్శన్ కూడా తన వంతుగా కామెడీ డోస్ ఇచ్చాడు. వెన్నెల కిషోర్ కనిపించిన కాసేపు హంగామా చేసి వెళ్తాడు. నక్సలైట్ నాయకులుగా సాయిచంద్.. శత్రు ఇద్దరూ బాగా చేశారు. ఉపేంద్ర లిమాయే కామెడీ కామెడీ పెద్దగా వర్కవుట్ కాలేదు. రాధిక శరత్ కుమార్ పాత్రను మొదట్లో చూసి ఏదో అనుకుంటాం కానీ.. ఆమెను సరిగా ఉపయోగించుకోలేదు. తన పాత్రను తేల్చిపడేశారు. శ్రీకాంత్ అయ్యంగార్.. రఘుబాబు.. సరయు.. మిగతా ఆర్టిస్టులంతా ఓకే. సాంకేతిక వర్గం: 'కామ్రేడ్ కళ్యాణ్'లో టెక్నికల్ వాల్యూస్ బాగున్నాయి. సాయి శ్రీరామ్ ఛాయాగ్రహణం సినిమాకు పెద్ద ప్లస్ పాయింట్. పల్లెటూరు.. అడవి నేపథ్యంలో సన్నివేశాలను సహజంగా.. అందంగా తీర్చిదిద్దాడు. విజువల్స్ ఆద్యంతం ఆకట్టుకుంటాయి. విజయ్ బుల్గానిన్ పాటలు ఒక మోస్తరుగా అనిపిస్తాయి. ఒరియా అమ్మాయి పాట వినసొంపుగా సాగింది. బీజీఎం బాగానే కుదిరింది. ప్రొడక్షన్ వాల్యూస్ కు ఏమీ ఢోకా లేదు. సినిమాకు అవసరమైన మేర ఖర్చుపెట్టారు. క్వాలిటీ చూపించారు. ఇక రైటింగ్ విషయానికి వస్తే 'కామ్రేడ్ కళ్యాణ్' మూల కథ బాగుంది. 'సామజవరగమన'తో పేరు సంపాదించిన భాను-నందు క్రియేట్ చేసిన కామెడీ సిచువేషన్లు.. పంచులు కూడా పేలాయి. కానీ స్క్రిప్టులో బిగి మాత్రం లేదు. నక్సలిజం మీద కథను మరీ ఇంత నాన్ సీరియస్ గా నడిపించడం మిక్స్డ్ ఫీలింగ్ ఇస్తుంది. దర్శకుడు జానకిరామ్ మారెళ్ళ కామెడీని బాగానే డీల్ చేయగలడనడానికి అనేక సన్నివేశాలు రుజువుగా నిలుస్తాయి. తన కామెడీ ఫ్లో బాగుంది. కానీ సీరియస్ గా కథ చెప్పాల్సిన చోట మాత్రం మరీ తేలిగ్గా నడిపించేశాడు.

# సినిమా రివ్యూ: చకోర




అక్టోబర్ రెండో వారంలో పెద్ద చిత్రాల సందడి లేకపోవడంతో చిన్న చిత్రాలు క్యూ కట్టాయి. అందులో పూరి జగన్నాథ్ శిష్యుడు మంగా శ్రీనివాస్ దర్శకత్వం వహించిన 'చకోర' ఒకటి. శ్రవణ్, మలైకా టి వాసుపల్, అనుష్క లూహార్ నటీనటులు. యామిని, ఎల్ బి శ్రీరామ్, సుమన్, బ్రహ్మాజీ, ఇంద్రజ, మణి చందన, సుదర్శన్ కీలక పాత్రధారులు. చింతాడ హేమారావు నిర్మించారు. శుక్రవారం విడుదలైన ఈ ప్రేమకథ ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుందో చూద్దాం. రావణ బ్రహ్మ (శ్రవణ్) రాజమండ్రిలో చదువు పూర్తి చేసి ఫైనాన్స్ చేస్తూ లైఫ్ ను జాలీగా ఎంజాయ్ చేస్తుంటాడు. చిన్నప్పటి నుంచి తల్లి తనను చందమామ కథలు చెబుతూ పెంచుతుంది. దాంతో ఎలాగైనా జాబిల్లి లాంటి అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని కలలు కంటుంటాడు. డాక్టర్ చదివే జూలీ అలియాస్ జాబిలి (మలైక వాసుపల్) అతనికి తారసపడుతుంది. ఆమెలో అమ్మ చెప్పిన చందమామ కథల్లోని జాబిలి తారసపడటంతో తొలి చూపులోనే ప్రేమలో పడతాడు. ఎలాగైనా ఆమెను దక్కించుకోవాలనే ప్రయత్నాలు చేస్తుంటాడు. ఓ సందర్భంలో ఇద్దరి మధ్య మాట కలిసి దగ్గరవుతారు. రావణ తన ప్రేమను వ్యక్తపరిచే సమయానికి జాబిలి ఓ మెలిక పెడుతుంది. 24 గంటలపాటు తనకు దూరం ఉండాలని, మాట్లాడకూడదన్నది ఆ కండీషన్. ఆ తర్వాత ఏం జరిగింది. రావణ్ చకోర పక్షిలా ఆమె కోసం గోవా తదితర ప్రాంతాలలో ఎందుకు గాలించాడు. ఈ వెతుకులాటలో జాబిలి రావణకు కనిపించకుండానే అతని ప్రతి అడుగు గమనించడానికి కారణమేంటి? అసలు ఆమెకు ఏమైంది? వారిద్దరూ ఒకటయ్యారా? అనుష్క లుహార్ కు, రావణ్ కు మధ్య సంబంధం ఏంటి? అన్నదే ఈ 'చోకోర' కథ. చకోర పక్షికి, జాబిలికి ఉన్న సంబంధం గురించి అమ్మ చెప్పే చిన్న ప్రేమ కథ ఇది. దానిని ఈతరం ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా దర్శకుడు తీర్చిదిద్దాడు. ఫస్టాఫ్ అంతా హీరోహీరోయిన్ల పరిచయం, జాబిలి లాంటి అమ్మాయిని ప్రేమలో దింపడం కోసం హీరో ప్రయత్నాలు... అమ్మాయి దార్లోకి రాకపోవడం వంటి సీన్స్ తో ఫస్టాఫ్ ముగుస్తుంది. ఇదంతా కథని అక్కడక్కడే తిప్పిన ఫీలింగ్ కలుగుతుంది. ఇంటర్వెల్ కు ముందు హీరోయిన్ పెట్టే కండీషన్, హీరోకి కనిపించకుండా అదృశ్యం కావడంతో సెకండాఫ్ పై ఆసక్తి కలుగుతుంది. అక్కడి నుంచీ హీరో, హీరోయిన్ ని వెతికే క్రమంలో ఎలాంటి పరిణామాలు ఎదురయ్యాయి? వాటి నుంచి ఏం నేర్చుకున్నాడు అన్నది ఆసక్తికరంగా సాగుతుంది. కంటికి కనిపించకుండా ఫోన్లోనే మాట్లాడుతూ జాబిలి ఎందుకు హీరో ఎమోషన్స్ తో ఎందుకు ఆడుకుందన్నది దర్శకుడు ఎంతో పట్టుగా తెరకెక్కించాడు. అయితే ఆమె ఏదో సమస్యలో ఉందన్నది మాత్రం ఊహకు అందేలా ఉండటం పెద్ద మైనస్. ఆ సస్పెన్స్ దర్శకుడు మెయిన్టైన్ చేయలేకపోయాడు. ఇక రిపీటెడ్ సీన్స్ కాస్త విసుగు తెప్పిస్తాయి. ఫైనల్ గా మరో హీరోయిన్ అనుష్క లూహార్తో ఇచ్చిన ట్విస్ట్ మాత్రం హైలైట్ అనిపిస్తుంది. చకోర పక్షికి దాహం వేస్తే ఎక్కడపడితే అక్కడ నీళ్లు తాగకుండా వర్షపు నీళ్లతోనే దాహం తీర్చుకుంటుంది. అలాగే జీవితంలో స్వచ్ఛమైన ప్రేమ కోసం ఎంత కాలమైనా వేచి చూడాలని, దాని కోసం అలుపెరగని ప్రయత్నం చేయాలనే విషయాన్ని దర్శకుడు ఈ సినిమా ద్వారా చెప్పాడు. హీరోగా శ్రవణ్ కు ఇది తొలి సినిమా. అయినా అనుభవం ఉన్న నటుడిలా పాత్రకు న్యాయం చేశాడు. లవ్ స్టోరీ కావడం, అతని వయసుకు తగ్గ పాత్ర కావడంతో ఈజ్ తో చేసుకెళ్లిపోయాడు.

# మోక్షజ్ఞ ఎంట్రీకి వశిష్ట మైండ్ బ్లోయింగ్ ప్లాన్



నందమూరి నటసింహం బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ వెండితెర అరంగేట్రంపై టాలీవుడ్‌తో పాటు తెలుగు సినీ ప్రియుల్లో ఎప్పటినుంచో భారీ ఆసక్తి నెలకొనడం, ఈ మధ్య అధికారిక ప్రకటన రావడం తెలిసిందే. ఇప్పుడా ఆసక్తిని రెట్టింపు చేసేలా.. తాజాగా ఓ వార్త వైరల్ అవుతోంది.నందమూరి నటసింహం బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ వెండితెర అరంగేట్రంపై టాలీవుడ్‌తో పాటు తెలుగు సినీ ప్రియుల్లో ఎప్పటినుంచో భారీ ఆసక్తి నెలకొంది. 'బింబిసార'తో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టి, ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవితో 'విశ్వంభర' వంటి మెగా ఫాంటసీ చిత్రాన్ని పూర్తి చేసిన యువ దర్శకుడు మల్లిడి వశిష్ట దర్శకత్వంలో మోక్షజ్ఞ డెబ్యూ ప్రాజెక్ట్ లాక్ అయిన సంగతి తెలిసిందే. అయితే, ఈ చిత్రాన్ని ఎలా తీర్చిదిద్దబోతున్నారు? కథాంశం ఏంటి? అనే అంశాలపై సినీ వర్గాల్లో రోజుకో క్రేజీ వార్త చక్కర్లు కొడుతోంది. ఈ క్రమంలో దర్శకుడు వశిష్ట సిద్ధం చేసిన మాస్టర్ ప్లాన్ గురించిన తాజా అప్‌డేట్స్ నందమూరి అభిమానులకు పూనకాలు తెప్పిస్తున్నాయి. దర్శకుడు వశిష్ట తన బలమైన సోషియో-ఫాంటసీ జానర్‌నే మోక్షజ్ఞ కోసం ఎంచుకున్నారని తెలుస్తోంది.

## బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు
## కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ ఆదేశాలు



సత్యవార్త కామారెడ్డి

తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను మహిళలు వైభవం గా జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కామారెడ్డి జిల్లా మున్సిపల్ చైర్ పర్సన్ విప్ప ఉమారాణి శ్రీనివాస్లు అధికారులను ఆదేశించారు జిల్లా కేంద్రంలోని బతుకమ్మ ఘాటు వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రత్యేకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఆనందోత్సవాలతో జరుపుకోవాలని ఉద్దేశంతో మున్సిపాలిటీ పరిధిలోని బతుకమ్మ గాట్ల వద్ద ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నట్లు చైర్పర్సన్ తెలిపారు పండుగకు వచ్చే మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు బతుకమ్మ గాట్ల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా తాగు నేటి సదుపాయము తగిన లైటింగు ఏర్పాటు చేయాలని ఆదేశించారు పారిశుద్ధ్యము విద్యుత్తు మరమతు పనులను సరితగా దిన పూర్తి చేయాలని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని పరిశుద్ధ సిబ్బందికి సూచించారు మహిళల బాధ్యతలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిమజ్జన సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా లోతైన నీటి ప్రాంతాల వద్ద ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు పండుగ సమయంలో మున్సిపల్ అధికారులు పారిశుద్ధ సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు మహిళలందరూ బతుకమ్మ పండుగకు సురక్షితంగా సంతోషంగా జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీధర్ రెడ్డి సురేందర్ రెడ్డి డి ఈ హనుమంతరావు ఏఈ వేణు ఆర్.ఓ గోపాల్ రెడ్డి ఆర్ఐ సాయిలు రమేష్ ప్రశాంత్ మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

## నిబంధనలు మేము అనుసరించాము

న్యూయార్క్, అక్టోబరు 10 : అమెరికన్ ఉద్యోగుల స్థానంలో హెచ్-1బీ వీసాదారులను నియమించుకుంటోందన్న ఆరోపణలతో, మైక్రోసాఫ్ట్ సంస్థను 'పెర్మ్' (పర్మినెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్-ఖఇఖీఓ) గ్రీన్ కార్డ్ ప్రక్రియ నుంచి ట్రంప్ ప్రభుత్వం తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. మైక్రోసాఫ్ట్ ఈ కార్యక్రమాన్ని దుర్వినియోగం చేస్తోందని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, ఈ ఆరోపణలను మైక్రోసాఫ్ట్ యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. తాము ఎటువంటి నిబంధనలను ఉల్లంఘించలేదని స్పష్టం చేసింది. ఈ వివాదంపై మైక్రోసాఫ్ట్ స్పందిస్తూ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో తాము దాఖలు చేసిన సుమారు 6,000 హెచ్-1బీ దరఖాస్తుల్లో దాదాపు 80 శాతం దరఖాస్తులు, ఇప్పటికే సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల వీసా పొడిగింపు లేదా వారి హోదా (స్టేటస్) మార్పునకు సంబంధించినవేనని వివరించింది. ఇవి కొత్త నియామకాలు కావని స్పష్టం చేసింది. మిగిలిన దరఖాస్తులు సైతం అమెరికాలో ఇప్పటికే చట్టబద్ధంగా నివసిస్తూ తమ సంస్థలో చేరిన వారికి సంబంధించినవని, వీరు తమ మొత్తం అమెరికా సిబ్బందిలో కేవలం ఒక శాతం మాత్రమేనని పేర్కొంది. హెచ్-1బీ ఉద్యోగులకు సైతం సమాన పనికి సమాన వేతనం అందిస్తున్నామని, టెక్ రంగంలోనే అత్యధిక వేతనాలు చెల్లిస్తున్న సంస్థల్లో తమది ఒకటని ఈ సందర్భంగా వెల్లడించింది. గత ఏడాది మైక్రోసాఫ్ట్ సుమారు 6,000 మంది ఉద్యోగులను తొలగించిందని, అదే సమయంలో దాదాపు 6,300 హెచ్-1బీ వీసాలు, 3,000 గ్రీన్ కార్డులకు అనుమతులు పొందిందని జేడీ వాన్స్ ఆరోపించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే అమెరికా కార్మిక శాఖ మైక్రోసాఫ్ట్‌పై చర్యలు తీసుకుంది. మైక్రోసాఫ్ట్‌తో పాటు అడోబ్ సహా మరికొన్ని ప్రధాన ఐటీ సంస్థలను కూడా పెర్మ్ కార్యక్రమం నుంచి సస్పెండ్ చేశారు. ఈ జాబితాలో కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), విప్రో, హెచ్‌సీఎల్, క్యాప్‌జెమినీ వంటి భారత ఐటీ దిగ్గజాలు కూడా ఉండటం గమనార్హం. ఈ సస్పెన్షన్ కారణంగా సదరు కంపెనీలు ప్రస్తుతానికి కొత్తగా పెర్మ్ దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉండదు. అయితే, కొత్త హెచ్-1బీ వీసాలకు దరఖాస్తు చేసుకోవడంపై గానీ, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల హోదాపై గానీ ఈ నిర్ణయం ఎటువంటి ప్రభావం చూపదు. మరోవైపు, ఈ తాజా పరిణామాలు అమెరికాలో ఉపాధి ఆధారిత గ్రీన్ కార్డుల కోసం వేచిచూస్తున్న భారతీయ ఐటీ నిపుణుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

## హుస్సేన్ సాగర్ టూ ప్రకాశం బ్యారేజ్ సీప్లేన్

హైదరాబాద్, అక్టోబరు 9 : హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ నీటిపై విమానం వేగంగా దూసుకెళ్లి ఆకాశంలోకి ఎగరడం, క్షణాల్లో కృష్ణా తీరానికి చేరుకుని విజయవాడ ప్రకాశం బ్యారేజీ జలాల్లో ల్యాండ్ అవ్వడం.. వినడానికే ఎంతో అద్భుతంగా అనిపించే ఈ ఊహ త్వరలోనే నిజరూపం దాల్చేలా కనిపిస్తోంది. ఇప్పటివరకు హైదరాబాద్-విజయవాడ నగరాల మధ్య నిత్యం వేలాది మంది ప్రయాణికులు జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ రైళ్లు, శంషాబాద్-గన్నవరం విమాన సర్వీసులపై ఆధారపడుతున్నారు. అయితే, సాధారణ రవాణా వ్యవస్థకు పూర్తి భిన్నంగా, ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సాగే అత్యాధునిక సీప్లేన్ సేవలను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ఈ సర్వీసులు ప్రారంభమైతే ప్రయాణ సమయం ఆదా కావడమే కాకుండా, తెలుగు రాష్ట్రాల పర్యాటక రంగానికి ఊహించని సరికొత్త ఊపు లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా సాహసోపేత, జల పర్యాటకాన్ని ఇష్టపడే దేశ, విదేశీ పర్యాటకులకు ఇదొక అద్భుతమైన అనుభూతిని అందిస్తుందనడంలో సందేహం లేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి ప్రాధాన్యతనిస్తూ, నూతన పర్యాటక పాలసీని రూపొందించి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఢిల్లీ పర్యటన సందర్భంగా కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రితో భేటీ అయినప్పుడు హుస్సేన్‌సాగర్-ప్రకాశం బ్యారేజీల మధ్య సీప్లేన్ సేవల నిర్వహణ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ సమావేశం అనంతరం ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసే ప్రక్రియ ఊపందుకుంది. దీనిలో భాగంగా భారత విమానాశ్రయాల సంస్థ



(ఏఏఐ)కి చెందిన ఉన్నతాధికారుల ప్రత్యేక బృందం క్షేత్రస్థాయిలో సమగ్ర అధ్యయనం చేపట్టింది. రాష్ట్ర పర్యాటకశాఖ, హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ఉన్నతాధికారులతో కలిసి ఏఏఐ ప్రతినిధులు హుస్సేన్‌సాగర్‌లోని వివిధ ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. జల విమానాలు సురక్షితంగా నీటిపై దిగేందుకు (ల్యాండింగ్), పైకి ఎగిరేందుకు (టేకాఫ్) అవసరమైన నీటి లోతు, ఉపరితల వైశాల్యం, ప్రవాహ వేగం వంటి సాంకేతిక అంశాలను లోతుగా లెక్కించారు. దీంతోపాటు విమానం నీటిపై ప్రయాణించే మార్గం (ట్యాక్సీ పార్క్), ప్రయాణికులు ఎక్కేందుకు మరియు దిగేందుకు వీలుగా జెట్టీలు, ప్యాసింజర్ టెర్మినల్ సదుపాయాలు ఎక్కడ ఏర్పాటు చేయవచ్చనే అంశాలపై సమగ్ర పరిశీలన జరిపారు. హుస్సేన్‌సాగర్‌లో చేపట్టిన క్షేత్రస్థాయి తనిఖీలకు సంబంధించిన అన్ని సాంకేతిక, పర్యావరణ వివరాలతో ఏఏఐ నిపుణుల బృందం త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదికను (డీపీఆర్ రూపంలో) సమర్పించనుంది. ఈ నివేదిక ఆధారంగా ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు, నిధుల కేటాయింపు, ఏజెన్సీల ఎంపికపై కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.

## నవీ పిళ్లైకు నోబెల్ శాంతి



న్యూఢిల్లీ, అక్టోబరు 9 : అంతర్జాతీయ న్యాయం, మానవ హక్కుల కోసం దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న భారత సంతతి న్యాయమూర్తి నవనీతం 'నవీ' పిళ్లేను 2026 సంవత్సరానికి గాను అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి పురస్కారం వరించింది. యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేక నేరాలు, జాతి నిర్మూలన వంటి తీవ్రమైన అంశాలపై నేరస్థులను చట్టం ముందు నిలబెట్టేందుకు ఆమె చేసిన విశేష కృషికి గుర్తింపుగా నార్వేజియన్ నోబెల్ కమిటీ శుక్రవారం ఈ ప్రకటన చేసింది. అసాధారణమైన ధైర్యం, నైతిక నిబద్ధతతో ప్రపంచ న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆమె పోషించిన పాత్రను కమిటీ కొనియాడింది. దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో వర్ణవివక్ష పాలనలో మగ్గుతున్న ఒక భారత తమిళ మూలాలు ఉన్న కుటుంబంలో నవీ పిళ్లే జన్మించారు. సమాజంలో పాతుకుపోయిన తీవ్రమైన వివక్ష, వేర్పాటువాదాన్ని ధైర్యంగా ఎదుర్కొంటూ న్యాయవాదిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. వర్ణవివక్షకు వ్యతిరేకంగా గళమెత్తిన నెల్సన్ మండేలా వంటి ఎందరో ఉద్యమకారులకు ఆమె న్యాయవాదిగా అండగా నిలిచారు. తన సుదీర్ఘ కెరీర్‌లో ఆమె దక్షిణాఫ్రికా హైకోర్టు న్యాయమూర్తిగా, రువాండా అంతర్జాతీయ క్రిమినల్ ట్రైబ్యునల్ (ఎఱఖీ), అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఎఅఅ) న్యాయమూర్తిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గానూ సేవలందించారు. ఇటీవల వరకు ఆక్రమిత పాలస్తీనా భూభాగంపై యూఎన్ ఏర్పాటు చేసిన స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కమిషన్‌కు అధ్యక్షత వహించారు. ప్రస్తుతం ఆమె మయన్మార్‌పై నమోదైన జాతి నిర్మూలన కేసులో అంతర్జాతీయ న్యాయస్థానం (ఎఅఏ)లో న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు. రువాండా ట్రైబ్యునల్‌లో నవీ పిళ్లే పాత్ర చరిత్రాత్మకమైనది. అత్యాచారం, లైంగిక హింసను కేవలం సాధారణ నేరాలుగా కాకుండా, మానవత్వానికి వ్యతిరేక నేరాలుగా, జాతి నిర్మూలన చర్యగా పరిగణించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. కేవలం విద్వేషపూరిత ప్రచారం ద్వారా జాతి నిర్మూలనకు ప్రేరేపించారన్న ఆరోపణలపై ఒక నిందితుడిపై విచారణ జరగడంలోనూ ఆమె ప్రభావం ఉంది. ఇది అంతర్జాతీయ న్యాయ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచిపోయింది. ప్రపంచంలో యుద్ధాలు, ఘర్షణలు పెరిగిపోతున్నాయని, అంతర్జాతీయ చట్టబద్ధ పాలన తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోందని నోబెల్ కమిటీ తన ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. అధికార రాజకీయాల ప్రాబల్యం పెరిగి, న్యాయ వ్యవస్థలు బలహీనపడుతున్నాయని పేర్కొంది. ఇలాంటి క్లిష్ట సమయంలో, శాంతికి న్యాయమే పునాది అని, అరాచకం, అధికార దర్పం మధ్య న్యాయాన్ని కాపాడే న్యాయమూర్తుల పాత్ర అత్యంత కీలకమని నొక్కి చెప్పింది. నవీ పిళ్లే వంటి ధైర్యవంతులు దేశాలను, నాయకులను జవాబుదారీగా నిలబెడుతూ, హింస బాధితులకు ఆశాకిరణంగా నిలుస్తున్నారని ప్రశంసించింది. ఆమె నిబద్ధత, స్వాతంత్ర్యం, అపారమైన అనుభవం ఆమెను మన కాలంలోని అత్యంత గౌరవనీయమైన అంతర్జాతీయ న్యాయవేత్తలలో ఒకరిగా నిలబెట్టాయని కమిటీ పేర్కొంది. ఆల్ఫ్రెడ్ నోబెల్ ఆశయాలకు అనుగుణంగా దేశాల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడంలో ఆమె చేసిన కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడింది.

## కాంగ్రెస్ వ్యూహాలకు ఎదురుదెబ్బలు



హైదరాబాద్, అక్టోబరు 9 : తెలంగాణలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ దూకుడు పెంచింది. ఆ పార్టీ దూకుడును అడ్డుకునేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తోంది. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు రావడం లేదు. ముఖ్యంగా బీఆర్ఎస్ నేతలు, సోషల్ మీడియా కార్యకర్తలపై నమోదవుతున్న కేసులు కోర్టుల్లో నిలవట్లేదు. బలమైన సెక్షన్లు నమోదు చేయకపోవడంతో కేసులు కోర్టుల్లో వీగిపోతున్నాయి. ఇది అధికార పార్టీ వర్గాల్లో తీవ్ర కలవరం రేపుతోంది. రాజకీయ ప్రత్యర్థుల దూకుడుకు కళ్లెం వేయాలని భావిస్తున్న కాంగ్రెస్ వ్యూహాలు అడుగడుగునా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తమను అప్పటి ప్రభుత్వం ఎలా వేధించిందో, ఎన్నిసార్లు జైలుకు పంపిందో కాంగ్రెస్ నేతలు పదే పదే గుర్తుచేసుకుంటున్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అదే స్థాయిలో ప్రతిపక్ష నేతలపై చట్టపరమైన చర్యలు ఉంటాయని భావించినా, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డిని, ఇతర ప్రముఖ నాయకులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై అధికార పార్టీ నేతలు పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నారు. అయితే.. పోలీసులు నమోదు చేస్తున్న కేసుల్లో గట్టి సెక్షన్లు ఉండటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నామమాత్రపు సెక్షన్ల కారణంగా నిందితులు సులభంగా కోర్టుల నుంచి ఊరట పొందుతున్నారు. జ్యుడీషియల్ రిమాండ్ దక్కకపోగా, కొద్ది గంటల్లోనే బెయిల్ పై బయటకు వస్తున్నారు. ఇది కాంగ్రెస్ శ్రేణులను నిరుత్సాహపరుస్తోంది. పోలీసుల తీరుపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. గతంలో తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కఠినమైన పోలీసు చర్యలను ఎదుర్కొన్నామని.. కానీ ఇప్పుడు ప్రతిపక్షాలపై అలా ఎందుకు వ్యవహరించలేకపోతున్నారని ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ భవిష్యత్తులో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తమ పరిస్థితి ఏమిటనే అభద్రతాభావం కొందరు నేతల్లో కనిపిస్తోంది. పోలీస్ యంత్రాంగం సరైన లీగల్ సెక్షన్లను ప్రయోగించడంలో విఫలమవుతోందని, దీనివల్ల అధికార పార్టీ పరువు పోవడంతో పాటు ప్రత్యర్థులకు రాజకీయ మైలేజీ దక్కుతోందని పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము ఫిర్యాదులు ఇస్తున్నప్పటికీ, తగిన ఆధారాలతో కూడిన పటిష్టమైన ఎఫ్ఐఆర్‌లు నమోదు కాకపోవడం వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని వాపోతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో కీలక చర్చ జరుగుతోంది. ఎంతమందిపై కేసులు పెట్టామనేదాని కంటే, పెట్టిన కేసులు ఎంత బలంగా ఉన్నాయనే దానిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. సోషల్ మీడియా పోస్టులు లేదా వ్యక్తిగత విమర్శల విషయంలో ప్రత్యర్థులను న్యాయపరంగా గట్టిగా నిలువరించాలంటే మరింత లోతైన లీగల్ రీసెర్చ్, పకడ్బందీ చట్టపరమైన చర్యలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఎదుటివారి దూకుడుకు అడ్డుకట్ట వేయడంలో ప్రస్తుత వ్యూహాత్మక లోపాలను సరిదిద్దకపోతే, అది రాబోయే కాలంలో పార్టీకి మరింత నష్టం చేకూర్చే ప్రమాదం ఉంది. ఏది ఏమైనప్పటికీ, చట్టపరమైన చిక్కులను అధిగమించి బీఆర్ఎస్ దూకుడును కట్టడి చేయడం కాంగ్రెస్ సర్కార్‌కు ప్రస్తుతం పెద్ద సవాల్‌గా మారింది.

## అర్ధరాత్రి ట్యాంక్‌బండ్‌పై బర్త్‌డే సెలబ్రేషన్స్ వద్దు



హైదరాబాద్ అక్టోబరు 9 : ట్యాంక్‌బండ్‌తో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రధాన రహదారులు, చెరువులు, పార్కుల వద్ద అర్ధరాత్రి వేళ పుట్టినరోజు వేడుకలు, కేక్ కటింగ్‌లు చేయవద్దని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ విషయంపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు, వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. సంతోషంగా జరుపుకోవాల్సిన పుట్టినరోజు వేడుకలు క్షణికావేశం, నిర్లక్ష్యం వల్ల కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగులుస్తున్నాయని, జీవితాంతం మిమ్మల్ని ఆ విషయాలు వెంటాడుతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం ట్యాంక్‌బండ్‌పై ఎలాంటి వేడుకలు నిర్వహించడంపై గతంలోనే జీహెచ్ఎంసీ (ఉఊఓఅ) స్పష్టమైన నిషేధ ఉత్తర్వులు జారీ చేసిందని సీపీ సజ్జనార్ గుర్తుచేశారు. రెండు రోజుల క్రితం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ట్యాంక్‌బండ్‌పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 6 సంవత్సరాల చిన్నారి పుట్టినరోజు నాడే ఆ పాపతో పాటు ఓ కుటుంబసభ్యుడు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన తనతో పాటు పోలీసులను ఎంతో కలిచివేసిందని సీపీ సజ్జనార్ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిని వారిని ఆస్పత్రికి తరలించి కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం రాలేదన్నారు. హైదరాబాద్‌లో భవిష్యత్తులో ఇలాంటి విషాదకర ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ట్యాంక్ బండ్‌పై ప్రమాద స్థలాన్ని పరిశీలించి, ఇతర ప్రభుత్వ విభాగాలతో కలిసి సమగ్ర సమీక్ష నిర్వహించినట్లు వెల్లడించారు. పుట్టినరోజు అనేది వ్యక్తిగత వేడుక కనుక, దానిని ఇళ్ల వద్ద లేదా సురక్షితమైన ప్రదేశాల్లోనే సెలబ్రేట్ చేసుకోవాలని ఐపీఎస్ సజ్జనార్ స్పష్టం చేశారు. అర్ధరాత్రి వేళల్లో రోడ్లు ఖాళీగా ఉండటం వల్ల వాహనాలు మితిమీరిన వేగంతో దూసుకొస్తుంటాయి. అలాంటి సమయంలో చిన్నపిల్లలను వెంటపెట్టుకుని నడిరోడ్డుపైకి రావడం అంత సేఫ్ కాదని ప్రజలకు ఆయన సూచించారు. పోలీసులు నిరంతరం పహారా కాస్తూ హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, అర్ధరాత్రి వేళల్లో సీక్రెట్‌గా రోడ్లపైకి వచ్చి వేడుకలు చేసుకోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. బర్త్ డే సమయంలో మీరు క్షణికానందం కోసం అమూల్యమైన ప్రాణాలను పణంగా పెట్టవద్దని హైదరాబాద్ ప్రజలకు సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

## ఓంకారేశ్వరస్వామి ఆలయం నుంచే అంతా



హైదరాబాద్, అక్టోబరు 9 : తెలంగాణ రాజకీయాల్లో మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ ప్రాజెక్టు ప్రస్తుతం అత్యంత చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు నది పరీవాహక ప్రాంతాల అభివృద్ధి, మరోవైపు చారిత్రక, ఆధ్యాత్మిక కేంద్రాల పునరుద్ధరణ పేరిట ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోంది. ఇందులో భాగంగా మంచిరేవుల ప్రాంతంలో చారిత్రక ప్రాధాన్యత కలిగిన శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయ పునరుద్ధరణ కోసం ప్రభుత్వం ఏకంగా రూ.1108.27 కోట్ల నిధులను కేటాయించింది. ఈ ఆలయానికి సుమారు 1,400 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ ప్రాజెక్టును కేవలం ఆలయ పునరుద్ధరణకు మాత్రమే పరిమితం చేయట్లేదు. దీని వెనుక బలమైన రాజకీయ, వ్యూహాత్మక కోణాలు దాగి ఉన్నాయి. మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టుపై మొదటి నుంచి విపక్షాలు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మతపరమైన, సాంస్కృతిక అంశాలను తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని ఆకర్షించాలని అధికార పార్టీ ఎత్తుగడ వేసినట్లు అర్థమవుతోంది. రూ.700 కోట్ల ప్రాథమిక అంచనా వ్యయాన్ని ఏకంగా రూ.1,108 కోట్లకు పెంచడం ప్రభుత్వ ప్రాధాన్యతలను, సంకల్పాన్ని చాటుతోంది. దక్షిణ కాశీగా అభివర్ణిస్తూ చేపట్టబోయే ఈ అభివృద్ధి పనుల్లో రూ.598.98 కోట్లు కేవలం నిర్మాణ పనులకే కేటాయించడం విశేషం. అలాగే 100 అడుగుల భారీ శివుడి విగ్రహం, రాజగోపురాలు, పుష్కరిణి వంటి హంగులు దీనికి వన్నె తేనున్నాయి. నగరంలోని ప్రధాన ప్రాంతాలను అనుసంధానించేందుకు రూ.159.62 కోట్లతో ఆరు లైన్ల రహదారి నిర్మాణాన్ని కూడా చేపట్టాలని నిర్ణయించారు.

## కెప్టెన్ స్మిత్ కు అత్యున్నత పురస్కారం



న్యూఢిల్లీ, అక్టోబరు 9 : భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ విమానంలో సహ పైలట్ దాడి చేసినా వెనక్కి తగ్గలేదు.. తీవ్రంగా గాయపడినా ధైర్యంగా పోరాడి 174 మంది ప్రాణాలను కాపాడారు. ఆయన సాహసానికి ఇజ్రాయెల్ ప్రభుత్వం అరుదైన గౌరవం ప్రకటించింది. దేశ అత్యున్నత పౌర సాహస పురస్కారాన్ని అందించనున్నట్లు అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ వెల్లడించారు. మచ్చర్ కోలుకున్న తర్వాత స్వయంగా పురస్కారాన్ని అందజేస్తానని తెలిపారు. గతవారం దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళుతున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. యూఏఈ దర్యాప్తు వివరాల ప్రకారం.. విమాన సహ పైలట్ హమామ్ అల్ హమామీ కాక్‌పిట్‌లోని గొడ్డలితో మచ్చర్‌పై దాడి చేశాడు. అనంతరం విమాన నియంత్రణను తన చేతుల్లోకి తీసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనను ఉగ్రదాడిగా యూఏఈ అధికారులు అభివర్ణించారు. తనపై దాడి జరిగినా మచ్చర్ ప్రతిఘటించారు. గాయాలతోనే కాక్‌పిట్ తలుపు తెరిచారు. దీంతో లోపలికి వచ్చిన ప్రయాణికులు దాడి చేసిన సహ పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి సాహసంతో విమానం ప్రమాదానికి గురికాకుండా నిలువరించగలిగారు. ఈ ఘటనలో ధైర్యంగా వ్యవహరించిన ఆరుగురు ఇజ్రాయెల్ పౌరులకు సైతం హెర్జోగ్ పౌర సాహస పురస్కారాలను అందించారు. తాలి మేనెస్, జ్వికా మేనెస్, యానివ్ హయూన్, డాక్టర్ షోటా ముసాయేవ్, అసఫ్ రజువాన్, ఓర్ పార్డిలోవ్‌లను జెరూసలేంలోని అధ్యక్ష భవనంలో జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. ఇదిలా ఉండగా.. విమానంలో జరిగిన భయానక ఘటనను మచ్చర్ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో పంచుకున్నారు. ఇజ్రాయెల్ తదుపరి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి వేడుక జ్యోతిని వెలిగించాల్సిందిగా మచ్చర్‌ను నెతన్యాహు ఆహ్వానించారు.

# సంగమేశ్వరకుంటలో విషాదం.. నీటిలో మునిగి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి

### -దసరా పండుగకు బట్టలు ఉతికేందుకు వెళ్లి ప్రమాదం.. గ్రామంలో విషాదఛాయలు



**సత్య వార్త సంగారెడ్డి ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ గ్రామ శివారులోని సంగమేశ్వరకుంటలో శుక్రవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. నీటిలో మునిగి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. 2026 అక్టోబర్ 9వ తేదీ ఉదయం 8:30 గంటల సమయంలో దసరా పండుగ నేపథ్యంలో ఇంట్లోని బట్టలు ఉతికేందుకు మానూర్ గ్రామానికి చెందిన మాటూరి నరసింహారెడ్డి, ఆయన భార్య కృష్ణవేణి, తమ్ముడు సంగారెడ్డి, చిన్న కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి కలిసి గ్రామ శివారులోని సంగమేశ్వరకుంటకు వెళ్లారు. అక్కడ నలుగురూ కలిసి బట్టలు ఉతుకుతుండగా ఉదయం సుమారు 11:30 గంటల సమయంలో సంగారెడ్డి ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయాడు. అతడిని కాపాడేందుకు ప్రయత్నించిన హర్షవర్ధన్ రెడ్డి సైతం నీటిలో పడిపోయాడు. దీంతో వారిద్దరిని రక్షించేందుకు నరసింహారెడ్డి, ఆయన భార్య కృష్ణవేణి నీటిలోకి దిగారు. అయితే ఈ క్రమంలో వారు కూడా నీటిలో మునిగిపోయారు. ఈ ప్రమాదం నుంచి బయటపడేందుకు హర్షవర్ధన్ రెడ్డి నీటి అంచున ఉన్న చెట్టు కొమ్మలను పట్టుకుని ఎలాగోలా ఒడ్డుకు చేరుకున్నాడు. అనంతరం గ్రామానికి వెళ్లి జరిగిన ఘటన గురించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, పోలీసులు వెంటనే సంగమేశ్వరకుంట వద్దకు చేరుకుని నీటిలో గల్లంతైన ముగ్గురి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో నీటిలో మునిగిపోయిన నరసింహారెడ్డి, కృష్ణవేణి, సంగారెడ్డిల మృతదేహాలను గుర్తించారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో మానూర్ గ్రామంలో విషాదం నెలకొంది. పండుగ వేళ సంతోషంగా గడపాల్సిన కుటుంబంలో ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. మృతుల్లో నరసింహారెడ్డి పెద్ద కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి ఇచ్చిన వాంగ్మూలం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనపై దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

# ఘనంగా CNR పాఠశాలలో బతుకమ్మ వేడుకలు -వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి సంబరాలు




**సత్యవార్త నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో అక్టోబర్ 8**

స్థానిక సీఎన్ఆర్ పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయ బృందం వివిధ రకాల రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చారు. అనంతరం బతుకమ్మ పాటలను ఆలపిస్తూ లయబద్ధంగా ఆడిపాడి సందడి చేశారు. సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు పండుగ వాతావరణాన్ని మరింత ఆహ్లాదకరంగా మార్చారు. పాఠశాల ఆవరణలో బతుకమ్మ వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు చంద్రకళ, మహిళా ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలియజేయవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు.

# బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మంత్రి సతీమణి వాకిటి లలిత



**సత్యవార్త మక్తల్ టౌన్**

మక్తల్ పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ప్రభుత్వ విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాల్లో మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు, విద్యార్థినులు ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా వాకిటి లలిత పేర్కొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో జరుపుకోవాలని వాకిటి లలిత గారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయినిలు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా నిలుస్తూ భరోసా కల్పిస్తున్న బెక్కెం వేణుగోపాల్ రెడ్డి

### -ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతో మందికి వైద్యం అందేలా కృషి.

**చిన్నంబావి మండలం సత్యవార్త**

చిన్నంబావి మండల పరిధిలోని వెల్లటూరు గ్రామానికి చెందిన ప్రజాల నాయకుడు, ప్రజా సేవకుడు, మానవతమూర్తి, పిలిస్తే పలికే నాయకుడు, ఆపదలో ఉన్న వారికి ఎంతో స్వయంకృషితో వారి అవసరాలు తీర్చే వ్యక్తి, ఇతరులకు సహాయం చేసే సేవా గుణం, మానవసేవే మాధవ సేవ అనే నినాదాన్ని హృదయంలో నింపుకొని, ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తున్న బెక్కెం వేణుగోపాల్ రెడ్డి సేవలు ఎందరికో ఆదర్శప్రాయంగా నిలిచాయి సమాజంలో అనారోగ్యంతో బాధపడుతూ, ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ఆయన అండగా నిలుస్తూ భరోసా కల్పిస్తున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతోమందికి వైద్యం అందేలా వారు చేస్తున్న కృషి అభినందనీయం. సీనియర్ కాంగ్రెస్ లీడర్, కాంగ్రెస్ పార్టీలో స్పోక్స్ పర్సన్ గా ఉంటూ తనకున్న పరిచయాలతో తన శక్తి మేర, అవసరమైన వారికి సహాయంచేస్తూ సాగిపోతున్నారు







ముఖ్యమైన సహాయ వివరాలు:

బుక్కాపురం మద్దిలేటి వనపర్తి జిల్లా, చినంబావి మండలం, వెల్లటూర్ గ్రామానికి చెందిన బుక్కాపురం మద్దిలేటి, గత కొంత కాలంగా మెదడు, నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. కర్నూలు తదితర ప్రైవేట్ ఆసుపత్రులలో ఎంత ఖర్చు చేసినా ఆరోగ్యం తక్కువ కాకపోగా, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని బెక్కెం వేణుగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకురాగా.. వారు వెంటనే స్పందించి, నిమ్స్ వైద్యులతో మాట్లాడే ఆసుపత్రిలో అడ్మిట్ చేయించి చికిత్స ప్రారంభించారు. అంతే కాకుండా, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 2,50,000/- ఎల్.ఓ.సి అంటే లెటర్ ఆఫ్ క్రెడిట్ (బ్యాంక్ హామీ పత్రం) మంజూరు చేయించి, నేరుగా అసుపత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. ఈ సహాయం పట్ల మద్దిలేటి కుటుంబ సభ్యులు వేణుగోపాల్ రెడ్డికి, రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గోవిందమ్మ (నాగర్ కర్నూల్ జిల్లా):

కొల్లాపూర్ మండలం, చుక్కాయిపల్లి గ్రామానికి చెందిన గోవిందమ్మ (భర్త: వెంకటస్వామి) మోకాళ్ల నొప్పుల సమస్యతో బాధపడుతుండగా.. వారి వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ. 2,00,000/-, ఎల్.ఓ.సి. ఇప్పించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

ఎం. రాజు (మేడ్చల్ జిల్లా):

మేడ్చల్ జిల్లా, కాప్రా, కుషాయిగూడకు చెందిన ఎం. రాజు, వెన్నెముక, తీవ్ర నరాల సమస్యతో బాధపడుతూ ప్రైవేట్ అసుపత్రుల చుట్టూ తిరిగి ఆర్థికంగా నష్టపోయారు. బాధితుని కుటుంబ సభ్యులు వేణుగోపాల్ రెడ్డిని సంప్రదించగా.. వారు మానవతా దృక్పథంతో స్పందించి, సీఎం సహాయ విధి ద్వారా రూ. 2,50,000/- ఆర్థిక సహాయం అందేలా కృషి చేశారు. కేవలం ఆర్థిక సహాయమే కాకుండా, నిమ్స్ వైద్య బృందంతో స్వయంగా మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా అండగా నిలిచారు. ప్రజాహితం కోసం నిరంతరం పరితపించే ఆయన అడుగులకు దేవుని ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని, ప్రజలకు మరింత విస్తృతంగా సేవ చేసే అవకాశం కలగాలని పలువురు అకాంక్షిస్తున్నారు..

# అర్జీ వన్ ఏరియాలోని జీడికే 11 ఇంక్లైన్ గని లో టీబీజీకేస్ లో భారీగా చేరిన యువ కార్మికులు

### - గోదావరిఖనిలో జరిగే సింగరేణి కార్మిక గర్జనను విజయవంతం చేయండి

### -సింగరేణి సంస్థ లాభాలను వెంటనే ప్రకటించి 36% వాటాను కార్మికులకు చెల్లించాలి.

### ---టీబీజీకేస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి

**( సత్యవార్త- రామగుండం, అక్టోబర్,8)**

గోదావరిఖని రామగుండం రీజియన్ లోని 11 ఇంక్లైన్ గనిలో ఏర్పాటుచేసిన గేట్ మీటింగ్ హాజరై ప్రసంగించారు సింగరేణి కార్మికులు చెమటోడ్చి బొగ్గు ఉత్పత్తి చేస్తే సంస్థకు వచ్చిన లాభాలను ఇప్పటివరకు కూడా ప్రకటించకపోవడం దారుణం అని పేర్కొన్నారుగత రెండు సంవత్సరాల లో సంస్థ అభివృద్ధి పేరిట పక్కన పెట్టిన నిధులను ఎక్కడ ఖర్చు పెట్టారో చెప్పాలన్నారు సింగరేణిలో గత సంవత్సరంలో ఓఎంఎస్గణనీయంగా పెరిగిందని సంస్థ లాభాలు కూడా పెరుగుతాయని ఎదురుచూస్తున్నామని మిర్యాల రాజి రెడ్డి పేర్కొన్నారు. లాభాలను ప్రకటించి వెంటనే కార్మికులందరికీ 36% వాటాను పంచాలన్నారుసింగరేణి సంస్థకు ప్రభుత్వం నుంచి రావలసిన 60 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారుకావాలని సంస్థ ప్రొడక్షన్ ని తగ్గిస్తూ సంస్థను ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు అక్టోబర్ 14 బుధవారం రోజున గోదావరిఖనిలో జరిగే సింగరేణి కార్మిక గర్జనను విజయవంతం చేయాలని ఈ కార్యక్రమానికి విఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారని యువ కార్మిక సోదరులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారువర్కింగ్ ప్రెసెంట్ మాదాసు రామ్మూర్తి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్ జీవన్ ఇంచార్జ్ నూనె కొమరయ్య మాట్లాడుతూనెలకు మూడు బోర్డులను నిర్వహించి వంద శాతం మంది కార్మికులను అన్ ఫిట్ చేస్తామని చెప్పిన సంఘాలు కనీసం సంవత్సర కాలంగా మెడికల్ బోర్డులు సక్రమంగా నిర్వహించట్లేదన్నారువెంటనే ప్రతి నెల మూడు బోర్డులు నిర్వహించి అనారోగ్యంతో ఉన్న కార్మికుల అందరిని అన్ఫిట్ చేయాలని డిమాండ్ చేశారు కనీసం కార్మికులకు సేఫ్టీ పనిముట్లు బూట్లు డ్రిల్ బిట్లు అందించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఉత్పత్తి కావలసిన వస్తువులను అందించాలని వారు



అన్నారు అదేవిధంగా కార్మికులు ఎదుర్కొంటున్న 11 ఇంక్లైన్ రోడ్డును మరమ్మత్తు చేయాలని , గని పై కార్మికులు ఎదుర్కొంటున్న నీరు క్యాంటీన్ తదితర మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని పేర్కొన్నారు గుర్తింపు ప్రాతినిత్య సంఘాల కాలపరిమితి పూర్తయిందని అన్ని కార్మిక సంఘాలకు సమాన హోదా కల్పించాలని డిమాండ్ చేశారు అనంతరం దాదాపు 150 మంది యువ కార్మికులను టీబీజీకేఎస్ సంఘంలోకే కండువా కప్పి ఆహ్వానించడం జరిగినది జీడికే లెవెన్ ఇంక్లైన్ టీబీజీకేస్ పిట్ సెక్రెటరీ వాసర్ల జోసఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలోకేంద్ర కోశాధికారి చెల్పూరి సతీష్, మొదుంపల్లి రాజేశం మాసాడి సాయి చరణ్ పల్లె సురేందర్ అంబటి శ్రీనివాస్ చంద్రు శ్రీ నివాస్ జనగామ ప్రమోద్ ధర్మాజీ క్రుష్ణ సవాసి రాజు తొట తిరుపతి పిడుగు సతీష్ కోట రాజేష్ రాసమల్ల మహేందర్ మెరుగు హరీష్ సాయిక్రుష్ణ యాకుబ్ పాషా ఆరిఫ్ పాషా దడ సతీష్ కోండ సురేష్ నూనె సతీష్ ఆకుల మహేందర్ గంపల రఘు భరత్ చంద్ర సురేష్ సూర్యకుమార్ చంద్ర కాంత్ ప్రదీప్ మాచర్ల క్రాంతి అదిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# నాగల్‌గిద్దలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

### -తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ: పాఠశాలల ప్రధానోపాధ్యాయులు



నాగల్ గిద్ద జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



**సత్య వార్త సంగారెడ్డి ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గాయత్రి పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పాఠశాలల ఆవరణల్లో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మారుతి జాదవ్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ పండుగకు ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజించే గొప్ప సంప్రదాయం బతుకమ్మ పండుగలో ఉందని తెలిపారు. మన పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలు, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు గాయత్రి పాఠశాలలో విద్యార్థులతో ప్రిన్సిపల్ హనుమంతరావు పాటిల్ చదువుతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అదేవిధంగా గాయత్రి పాఠశాలలో కరస్పాండెంట్ హనుమంతరావు పాటిల్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని అన్నారు. విద్యార్థి దశ నుంచే మన పండుగలు, ఆచారాల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని సూచించారు. బతుకమ్మ పండుగ ద్వారా ప్రకృతి పట్ల ప్రేమ, పూల ప్రాముఖ్యత, సమాజంలో ఐక్యత వంటి విలువలు పెంపొందుతాయని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించడంతోపాటు మన సంప్రదాయాలపై గౌరవాన్ని పెంచుతాయని అన్నారు. పాఠశాలల్లో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. పూల బతుకమ్మలతో పాఠశాలల ఆవరణలు కళకళలాడాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పేలా వేడుకలు నిర్వహించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో ఆనందం వెల్లివిరిసింది.

# జాతీయ స్థాయి ఆర్మ్ రెజ్లింగ్‌లో కాంస్య పతకం సాధించిన అడ్డకల్ పోలీస్ స్టేషన్‌రాజ జి.రాధికకు జిల్లా ఎస్పీ డి.జానకి, అభినందనలు

### -పోలీస్ సిబ్బందిలో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు -- జిల్లా ఎస్పీ



**సత్య వార్త మహబూబ్ నగర్**

75వ అఖిల భారత పోలీస్ రెజ్లింగ్ క్లస్టర్--2026లో మహిళల 90o కిలోల ఆర్మ్ రెజ్లింగ్ విభాగంలో కాంస్య పతకం సాధించిన అడ్డకల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ జి.రాధికను జిల్లా ఎస్పీ డి.జానకి, శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పతకం సాధించడం మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖకు గర్వకారణమని పేర్కొన్నారు. తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్ క్యాలెండర్‌ను అఖిల భారత పోలీస్ స్పోర్ట్స్ మీట్ క్యాలెండర్‌తో అనుసంధానం చేయడం, వివిధ క్రీడల్లో క్లస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా మరింత మంది పోలీస్ సిబ్బందికి తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించే అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. ఈ విధానం ద్వారా జాతీయ స్థాయి పోటీలకు ముందుగానే ప్రణాళికాబద్ధంగా సిద్ధమయ్యేందుకు, అవసరమైన శిక్షణ పొందేందుకు సిబ్బందికి తగిన సమయం లభిస్తుందని వివరించారురాజ జి.రాధిక సాధించిన విజయం తెలంగాణ పోలీస్ శాఖలోని ప్రతిభ, క్రమశిక్షణ, అంకితభావం, క్రీడాస్ఫూర్తికి నిదర్శనమని ఎస్పీ పేర్కొన్నారు. ఆమెను అభినందిస్తూ, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి పోలీస్ శాఖకు, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# నేలకొండపల్లిలో 13న అంతర్జాతీయ బౌద్ధ వేడుకలు : ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్లు

**నేలకొండపల్లి అక్టోబర్ 9, సత్య వార్త**

ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని 3వ శతాబ్దం నాటి చారిత్రక బౌద్ధ మహాక్షేత్రంలో బౌద్ధ గురువు బంతే సిద్ధా రక్కిత ఆధ్వర్యంలో ఈ నెల 13న అంతర్జాతీయ బౌద్ధ ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఏర్పాట్లను అదనపు కలెక్టర్లు శ్రీనివాసరెడ్డి, డాక్టర్ శ్రీజ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ముఖ్యాంశాలు:

విదేశీ అతిథులు: కంబోడియా, సింగపూర్ దేశాల నుంచి 15 మంది ప్రముఖ బౌద్ధ భిక్షువులు హాజరై ప్రత్యేక ప్రార్థనలు, ధ్యానం, విశ్వశాంతి పూజలు నిర్వహిస్తారు. ముఖ్య అతిథులు: రాష్ట్ర మంత్రి పొంగులేటి



శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామారెడ్డి పాల్గొంటారు. ఏర్పాట్లు: విదేశీ ప్రతినిధులకు ప్రొటోకాల్ ప్రకారం వసతి, రవాణా కల్పించాలని, భక్తుల కోసం మంచినీరు, బయో టాయిలెట్లు, వైద్య శిబిరాలు, పారిశుధ్య చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# క్రిష్ణ మండలం కున్ని వద్ద కాలువ పూడికతీత పనులు

## - ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి సోదరుడు వాకిటి శేషగిరి



సత్యవార్త మక్తల్ టౌన్

మక్తల్ నియోజకవర్గం క్రిష్ణ మండలం కున్ని గ్రామం వద్ద వ్యవసాయ పంట పొలాలకు సాగునీరు అందించే కాలువలలో పూడికతీత పనులను మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు వారి సోదరుడు వాకిటి శేషగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా వాకిటి మాట్లాడుతూ.. క్రిష్ణ మండలం కున్ని గ్రామం నుంచి హిందుపూర్, తంగిడి కుసుమూర్తి, ఇటు చేగుంట వైపు సాగునీరు అందించే కాలువలలో పూడికతీత పనులను ప్రారంభించామని అన్నారు. నియోజకవర్గంలో దాదాపుగా అన్ని మండలాల్లో కాలువల పూడికతీత పనులు ఒక యజ్ఞంలా కొనసాగుతున్నాయని, మంత్రి వాకిటి శ్రీహరి గారు ప్రత్యేక చొరవ తీసుకొని దశాబ్దాల తరబడి పూడుకుపోయిన కాలువలకు తిరిగి జీవం పోస్తున్నారని, రైతులపై మంత్రి కి ఉన్న ప్రత్యేక నిబద్ధత ఇందుకు నిదర్శనమని కొనియాడారు. నూటికి నూరు శాతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాత ప్రభుత్వమని, ఇతరుల మాటలు నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రామేశ్వర దేవాలయంలో కార్తీక మాసం ప్రత్యేక పూజా కార్యక్రమాలు





సత్య వార్త షాద్ నగర్

కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలురంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో భక్తుల కోసం కార్తీక మాసంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల విజయాభివృద్ధి కోసం, వారి కోరికలు నెరవేరాలని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పూజా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు.అయితే కార్తీకమాసము పురస్కరించుకొని భక్తులకు కీలక విజ్ఞప్తి చేశారు. భక్తుల సౌకర్యార్థం సోమవారములు మరియు పౌర్ణమి రోజు స్వామివారికి అభిషేకములు రద్దుచేసి స్పర్శ దర్శనము మాత్రమే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీనికి భక్తులు సహకరించాలని దేవాలయ కార్య నిర్వహణ అధికారి శివకుమార్ తెలిపారు..

# నాగర్ కర్నూల్‌లో బీసీ జేఏసీ ఏర్పాటు

## -52 శాతం రిజర్వేషన్లు, బీసీ జనగణన కోసం ఉద్యమం ఉధృతం



సత్యవార్త నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 9

బీసీల ఆత్మగౌరవం, సమాన వాటా, రాజ్యాధికారమే లక్ష్యంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో వివిధ బీసీ సంఘాల నాయకులు సమావేశమై బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)ని ఏర్పాటు చేశారు. బీసీ సంఘాల పేర్లు వేరైనా లక్ష్యం ఒక్కటేనని, జిల్లాలో బీసీ వాదాన్ని బలంగా వినిపించేందుకు ఐక్యంగా ఉద్యమిస్తామని నాయకులు ప్రకటించారు.బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు, బీసీ జనగణన, రాజకీయ రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయాలని తీర్మానించారు. త్వరలో మండల స్థాయి సమావేశాలు నిర్వహించి, బీసీ మహా గర్జనకు సన్నద్ధమవుతామని తెలిపారు.ఈ సందర్భంగా బీసీ జేఏసీ అడ్‌హాక్ కమిటీ కన్వీనర్‌గా మక్యాల శివ శంకర్ యాదవ్‌ను, కో-కన్వీనర్లుగా కుంభం మల్లేష్ గౌడ్, చర్ల ఇటికాల లక్ష్మయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా నలుమూలల నుంచి బీసీ సంఘాల నాయకులు, వివిధ కులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఓటర్ నమోదు పత్రాన్ని తాసిల్దార్ కి ఇవ్వాలి




సత్య వార్త.మక్తల్.

గ్రాడ్యుయేటర్లు ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటర్లుగా నమోదు చేసుకున్న తర్వాత కాఫీ ని జిరాక్స్ తీసి గజిటెడ్ సంతకం చేసిన కాపీని తాసిల్దార్ కార్యాలయంలో అందజేయాలని ఎంఆర్ ఓ సతీష్ కుమార్ తెలిపారు, ఈ ప్రాంత ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జి అధికారిగా నారాయణ పేట ఆర్డీవో రమేష్ బాధ్యతలు నిర్వహిస్తున్నారని మండల సబార్డినేట్ గా ఆయా మండలాల తాసిల్దార్లు ఉంటారన్నారు. ఓటు నమోదు చేసుకున్నాక పత్రాలని సేకరించి ఎంక్వయిరీ చేసి వాటిని జిల్లా కలెక్టర్ ద్వారా ఎన్నికల అధికారికి తాము అందజేస్తామని సతీష్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం మహబుబ్ నగర్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోమని ప్రభుత్వం ప్రకటన చేయించడం తో డిగ్రీ పూర్తి చేసిన ప్రతి వ్యక్తి ఎమ్మెల్సీగా ఓటు సమోదుకు సిద్ధ పడుతున్నారు. అయితే ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకున్న కాపీని అటెస్టేడ్ చేయించి తాసిల్దార్ కార్యాలయంలో సమర్పించాలని ఆయన అంటున్నారు. తప్పులు లేకుండా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని లేదంటే ఓటర్గా నమోదు రద్దయ్య ప్రమాదం ఉందని జాగ్రత్తలు పాటించాలని తాసిల్దార్ సతీష్ కుమార్ చెప్తున్నారు చెప్తున్నారు.

# 16 గంటల పాటు క్లిష్టమైన బ్రెయిన్ బైపాస్ సర్జరీ విజయవంతం

## -ప్రాణాపాయ స్థితిలో ఉన్న 24 ఏళ్ల యువకుడికి అరుదైన శస్త్రచికిత్స

సత్యవార్త ప్రతినిధి :: మహబూబ్‌నగర్, అక్టోబర్ 9:

ప్రాణాపాయ ప్రమాదం ఉన్న జెయింట్ మిడిల్ సెరిబ్రల్ ఆర్టరీ (ఎంసీఏ) అన్యూరిజంతో బాధపడుతున్న 24 ఏళ్ల యువకుడికి మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. సుమారు 16 గంటల పాటు సాగిన ఈ శస్త్రచికిత్సలో రెండు సెరిబ్రల్ బైపాస్‌లు ఏర్పాటు చేసి, రెండు జెయింట్ అన్యూరిజం క్లిప్‌ల సహాయంతో ప్రమాదకర రక్తనాళ ఉబ్బరాన్ని మెదడు రక్తప్రసరణ నుంచి వేరు చేశారు.సుమారు రెండు నెలలుగా పదేపదే తీవ్రమైన తలనొప్పితో బాధపడుతున్న యువకుడికి వైద్య పరీక్షలు నిర్వహించగా, మెదడులో ప్రాణాంతక స్థాయిలో ఉన్న జెయింట్ ఎంసీఏ అన్యూరిజం ఉన్నట్లు గుర్తించారు. అన్యూరిజం పరిమాణం, అది ఉన్న ప్రదేశం, మెదడులోని రక్తనాళాల సంక్లిష్ట నిర్మాణాన్ని పరిగణనలోకి తీసుకొని వైద్యులు ప్రత్యేక శస్త్రచికిత్సకు ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా ఎస్టీఏ--ఎంసీఏ బైపాస్‌ల ద్వారా మెదడుకు రక్తప్రసరణను కొనసాగించేలా సెరిబ్రల్ రీవాస్క్యులరైజేషన్ ప్రక్రియ చేపట్టారు.శస్త్రచికిత్స అనంతరం ఐసీజీ యాంజియోగ్రఫీ ద్వారా పరిశీలించగా, అన్యూరిజం పూర్తిగా రక్తప్రసరణ నుంచి వేరుపడినట్లు, ఏర్పాటు చేసిన రెండు బైపాస్‌లు సమర్థవంతంగా పనిచేస్తున్నట్లు నిర్ధారించారు. ఇంతటి సంక్లిష్టమైన శస్త్రచికిత్స జరిగినప్పటికీ యువకుడు వేగంగా కోలుకుంటున్నాడని, ఎలాంటి ముఖ్యమైన నాడీ సంబంధిత లోపాలు తలెత్తలేదని వైద్యులు తెలిపారు.




ప్రస్తుతం అతను తన రోజువారీ పనులను స్వయంగా చేసుకునే స్థితిలో ఉన్నట్లు వెల్లడించారు. ఈ శస్త్రచికిత్సను సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ బి. జయానంద్ సుధీర్, అసోసియేట్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ వంశీ రెడ్డి పరపతి నేతృత్వంలోని వైద్య బృందం నిర్వహించింది. మెదడులోని జెయింట్ ఇంట్రాక్రానియల్ అన్యూరిజాలకు చికిత్స అందించేటప్పుడు ప్రమాదకర రక్తనాళ ఉబ్బరాన్ని నియంత్రించడంతో పాటు, మెదడుకు అవసరమైన సాధారణ రక్తప్రసరణను కాపాడటం అత్యంత కీలకమని వైద్యులు వివరించారు. రెండు సెరిబ్రల్ బైపాస్‌లు, రెండు అన్యూరిజం క్లిప్‌లతో కూడిన ఈ 16 గంటల శస్త్రచికిత్స ద్వారా ఆ రెండు లక్ష్యాలను సాధించగలిగామని తెలిపారు.

# చట్టాలపై అవగాహనతోనే నేరరహిత సమాజ నిర్మాణం

## -వట్టెంలో న్యాయ విజ్ఞాన సదస్సు.. ఉచిత న్యాయ సేవలపై ప్రజలకు అవగాహన

సత్యవార్త నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 9

రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు నాగర్ కర్నూల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బిజినపల్లి మండలంలోని వట్టెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగర్ కర్నూల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి నిహారిక మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ప్రజలకు చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే నేరాలను అరికట్టడంతోపాటు సమాజంలో న్యాయం, శాంతి భద్రతలను కాపాడవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాల పట్ల అవగాహన పెంపొందించుకోవడం ద్వారా నేరరహిత సమాజ నిర్మాణానికి కృషి చేయవచ్చని అన్నారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను ఆమె వివరించారు. న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్తోమత లేని అర్హులైన వారికి సంస్థ తరపున ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. ఉచిత న్యాయ




సలహాలు, న్యాయ సహాయం అవసరమైన వారు 15100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సేవలను పొందవచ్చని సూచించారు.అనంతరం ప్రజలకు ఉన్న న్యాయపరమైన సందేహాలను నివృత్తి చేసి, చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య, గ్రామ సర్పంచ్ జ్యోతిశంకర్, పంచాయతీ కార్యదర్శి మహేష్ నాయక్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గద్వాలలో పదేళ్ల పండుగ ఉత్సవాలు

## -జిల్లా ఆవిర్భావానికి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విద్యార్థి - యువజన సదస్సు కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి- బాసు హనుమంతు నాయుడు -మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్



సత్య వార్త జోగులాంబ గద్వాల

గద్వాల జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ కళాశాలలో తెలంగాణలో కొత్త జిల్లాల ఏర్పాట్లు భాగంగా కేసీఆర్ గద్వాల జిల్లాను ఏర్పాటు చేసి పదేళ్లు పూర్తి అయిన సందర్భంగా దీ=ా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు విద్యార్థి యువజన సదస్సులో పార్టీ శ్రేణులతో కలిసి బాసు హనుమంత నాయుడు పాల్గొన్నారు..... అనంతరం,జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....గద్వాల జిల్లాను ఏర్పాటు చేసి,విద్యార్థుల చదువుకు అనుగుణంగా నర్సింగ్ కాలేజ్ ను, మెడికల్ కాలేజ్ ను మరియు విద్యాపరంగా మేలు చేసిన ఘనత కెసిఆర్ కే దక్కుతుందని అని అన్నారు...కొత్త జిల్లాలు ఆవిర్భవించి అక్టోబర్ 11 నాటికి పదేండ్లు పూర్తవుతున్న సందర్భంగా గద్వాల లో దశాబ్ది సంబురాలను అట్టహాసంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రజలు మరియు విద్యార్థుల చిరకాల కలను సాకారం చేసిన కేసీఆర్ ఘనతను విద్యార్థులకు వివరించారు... కొత్త జిల్లాల ఏర్పాటుతో దశాబ్దాలుగా ప్రజల కన్నకలలు నెరవేరాయని పునరుద్ఘాటించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ప్రజల మద్దతుతో అధికారం చేపట్టిన కేసీఆర్ పాలనాసంస్కరణలకు శ్రీకారం చుట్టి పది జిల్లాల ఉన్న తెలంగాణను 33 జిల్లాలుగా మార్చి ప్రజల చిరకాల కలను సాకారం చేశారని గుర్తుచేశారు. గద్వాల జిల్లా ఏర్పాటుగద్వాల ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని అభివర్ణించారు...జిల్లా కేంద్రాలకు వెళ్లేందుకు గతంలో 100-150 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేదని,కానీ జిల్లాల పునర్వ్యవస్థీకరణతో ఆ పరిస్థితి మారిందని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో మౌలిక వసతులు వచ్చాయని, అద్భుతమైన కలెక్టరేట్లు, మెడికల్,నర్సింగ్ కళాశాలలు,మరియు విద్య పరంగా రూపుదిద్దుకున్నాయని గుర్తుచేశారు. శాంతిభద్రతల పర్యవేక్షణ పెరిగి, విద్య, వైద్య సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చామని తెలిపారు....ఈ కార్యక్రమంలో నాగర్ దొడ్డి వెంకట్రాములు, జి.రాఘవేంద్ర రెడ్డి,కురవ పల్లయ్య,అంగడి బసవరాజు,కోటేష్,చిత్తరి కిరణ్,కమ్మరి రాము,లక్ష్మీకాంత్ రెడ్డి,బీచుపల్లి,చక్రిధర్ రెడ్డి,వెంకటేష్ నాయుడు,భరత్ సింహారెడ్డి, రంజిత్ కుమార్,రాముడు,శ్రీరాములు,ముని రెడ్డి,డ్యామ్ శ్రీను,అరవింద్, రాము,ప్రభాకర్,తిమ్మప్ప, మహేష్, లక్ష్మణ,ప్రవీణ్,మరియు నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.....

# జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు



గోపాలపేట సత్యవార్త ప్రతినిధి (అక్టోబర్ 9)

గోపాలపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల గోపాల్పేట కళాశాల అధ్యాపకులు ప్రిన్సిపాల్ విద్యార్థిని విద్యార్థులు శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో గౌరమ్మకు ప్రిన్సిపాల్ సుప్రజాత కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించి అనంతరం బతుకమ్మ పాటలు ప్రారంభించి విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడారు.బతుకమ్మలు ఆడిన అనంతరం గౌరమ్మను తీసుకెళ్లి దేవాలయం ముందు ఉన్నటువంటి కోనేరులో నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, వెంకటేష్, శేషయ్య, రాములు, శ్రీధర్ బాబు, నరసింహ, సోమయ్య, అనిల్ కుమార్, స్వర్ణలత, అమూల్య విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వొకేషనల్ కళాశాలలో ఘనంగా "ఫ్రెషర్స్ పార్టీ" వేడుకలు: పాల్గొన్న మేయర్ గుమ్మల మమత



సత్య వార్త మహబూబ్ నగర్

మహబూబ్‌నగర్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో "ఫ్రెషర్స్ పార్టీ" వేడుకలు ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్‌లి గుమ్మల మమత శ్రీనివాస్ ముదిరాజ్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ?ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభ చూపి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. వొకేషనల్ కోర్సుల ద్వారా ఉజ్వలమైన భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చని, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో, నిర్దిష్టమైన లక్ష్యంతో శ్రమించి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.?ఈ కారిక్రమంలో ఎస్పీ జానకి కార్పొరేటర్ ప్రవీణ్ , కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థి సంఘాల నాయకులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు



సత్య వార్త , రుద్రంగి, (అక్టోబర్ 09)

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మను పేర్చి, ఈ పూల పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు, మహిళా ఉపాధ్యాయులు రంగురంగుల దుస్తులు ధరించి, బతుకమ్మ చుట్టూ పాటలు పాడుతూ సందడి చేశారు. పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రదానోపధ్యాయులు సమ్మిరెడ్డి, మండల విద్యాధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని అఖిలపక్ష ధర్నా




సత్యవార్త, గద్వాల అక్టోబర్ :09

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా కేంద్రం లోని గద్వాల పట్టణంలో కృష్ణవేణి చౌక్‌లో అఖిలపక్షాల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ ధర్నా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తరఫున డీసీసీ సెక్రటరీ మధునాయుడు ఎస్సీఎల్ స్టేట్ వైస్ చైర్మన్ మాలా శ్రీనివాసులు , యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీలు మహేందర్,ఎండీ మహబూబ్, 28వ వార్డు సీనియర్ నాయకులు ఎండీ మోహన్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం నిలబెట్టేందుకు ఎన్నికల కమిషన్ పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Publisher, Printer, Owner Tatikonda Krishna, H.No 2-17-100, JaiBheemnagar, Kollapur Village & Mandal, Mahabubnagar Dist (TS) 509102 Printed at Shiva Sai Printers, H.No 4-10-58, 59 Ramnagar,Mahabubnagar-509001.
Published From H.No 2-17-100, JaiBheemnagar, Kollapur Village & Mandal, Mahabubnagar Dist (TS) Ph:08542-250511,9440752375 e mail satyavartha@rediffmail.com, Editor:Tatikonda Krishna